
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
బుధవారం 5 నవంబరు 2025



తోట్లవల్లూరు గ్రామ పంచాయతీ అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. షాపింగ్ కాంప్లెక్స్‌ల్లోని అద్దె దారుల నుంచి నగదు వసూలు చేసి జూనియర్ అసిస్టెంట్ సునీల్‌కుమార్ వాడేసుకున్నాడు. విచారణలో నిర్ధారణ కావడంతో అతన్ని అధికారులు సోమవారం సస్పెండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఇంటి పన్నులు కట్టించుకుని పంచాయతీకి జమ చేయని విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయంలో ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు సిబ్బంది చేతివాటం చూపుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. తన ఇంటి పన్నును గుర్తు తెలియని వ్యక్తితో కట్టించుకుని, అతనికి రశీదు కూడా ఇవ్వడంపై ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పంచాయతీలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించాడు.



తోట్లవల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయం

# ఇంటి పన్నుల్లోనూ చేతివాటం!

## అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా తోట్లవల్లూరు పంచాయతీ

- కాంట్రాక్టు సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగుల అవినీతి లీలలు
- పన్నులు కట్టినా బకాయి చూపిస్తున్న స్వర్ణ పంచాయతీ సైట్
- ఇంటి పన్ను అక్రమాలపై పోలీస్‌స్టేషన్‌లో ఓ వ్యక్తి ఫిర్యాదు
- ఇప్పటికే షాపుల అద్దె వాడేసుకున్న జూనియర్ అసిస్టెంట్ సునీల్‌కుమార్ సస్పెన్షన్

**ఆంధ్రజ్యోతి-తోట్లవల్లూరు :** తోట్లవల్లూరు గ్రామ పంచాయతీ అవినీతి, అక్రమాల ఊబిలో కూరుకుపోయింది. జూనియర్ అసిస్టెంట్ ఎల్.సునీల్‌కుమార్‌ను జిల్లా పంచాయతీ అధికారి జె.అరుణ సోమవారం సస్పెండ్ చేయటంతో మరిన్ని అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. గ్రామ పంచాయతీకి చెందిన 14 షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో అద్దెదారుల నుంచి సునీల్‌కుమార్ రూ.1,49,600 వసూలు చేసి పంచాయతీకి జమ చేయలేదు. అద్దె సొమ్ము తీసుకుని అద్దెదారులకు బిల్లులు ఇవ్వకుండా మూడు నెలల పాటు ఇబ్బంది పెట్టినట్టు రుజువయింది. అద్దెదారులు ఒత్తిడి చేయటంతో పంచాయతీ కార్యదర్శికి తెలియకుండా కార్యదర్శి స్టాంప్‌ముద్ర వేసి జూనియర్ అసిస్టెంట్‌గా ఉన్న సునీల్‌కుమార్ సంతకం చేయటం మరింత వివాదంగా మారింది. అద్దె



వీరంకి శ్రీనివాసరావు 2023-24లో చెల్లించిన ఇంటిపన్ను రశీదు



స్వర్ణ పంచాయతీ సైట్‌లో చూపుతున్న ఇంటి పన్ను బకాయి

### కాంట్రాక్టు సిబ్బందిపై ఆరోపణలు

తోట్లవల్లూరు పంచాయతీలో బిల్ కలెక్టర్ లేరు. దీంతో కాంట్రాక్టు సిబ్బందితో ఇంటి పన్నులు, నీటి పన్నులు వసూలు చేస్తున్నారు. ఎప్పటి నుంచో పాతుకుపోయిన కాంట్రాక్టు సిబ్బంది ఇష్టానుసారంగా పంచాయతీ డబ్బులను దుర్వినియోగం చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. జూనియర్ అసిస్టెంట్, కాంట్రాక్టు సిబ్బంది చేతివాటం బాగ పెరిగిందని తెలుస్తోంది. వీరంకి శ్రీనివాసరావు 2024-25 సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్ను చెల్లించేందుకు పంచాయతీకి వెళితే నీవు పన్ను కట్టేశావని జూనియర్ అసిస్టెంట్ సునీల్‌కుమార్ చెప్పారు. కాంట్రాక్టు సిబ్బంది బాషాకు ఇంటి పన్ను చెల్లించావని చెపితే నేను ఎవ్వరికి కట్టలేదు. నా ఇంటి పన్ను ఎవ్వరి చేత కట్టించారో తేల్చాలని శ్రీనివాసరావు పట్టుబడితే ఇంటిపన్ను రశీదు నాలిక గీసుకోటానికి కూడా పనికిరాదు పో అని పంచాయతీలో సమాధానం ఇవ్వటంతో అతను పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సొమ్మును చలానా రూపంలో పంచాయతీకి చెల్లించి ఆ తర్వాత డ్రా చేసి ఖర్చు చేయాల్సి ఉంది. అక్టోబర్ 16న డీఎల్‌పీవో విచారణకు వచ్చినపుడు ఈ లోపాలు బయటపడ్డాయి. ఆ తర్వాత అద్దె సొమ్మును పంచాయతీకే ఖర్చు చేసినట్టుగా బిల్లులు తెచ్చినా ఫలితం దక్కలేదు. ఇలా తప్పులు మీద తప్పులు చేసి సునీల్‌కుమార్ సస్పెండ్‌కు గురయ్యాడని చెప్పవచ్చు. జూనియర్ అసిస్టెంట్‌గా ఇంకా అనేక అక్రమాలు చేసినట్టుగా ఆరోపణలు బయటకు వస్తున్నాయి.

### ఇంటి పన్నుల్లో భారీగా దోపిడీ

తోట్లవల్లూరు పంచాయతీలో ఇంటి పన్నులను పక్కదారి పిట్టించినట్టు బలమైన ఆధారాలు వెలుగు చూస్తున్నాయి. సునీల్‌కుమార్ సస్పెండ్ అంశం గ్రామంలో చర్చనీయాంశంగా మారటంతో ఇంటి పన్నులు తాము కట్టినప్పటికీ బకాయిలు పెట్టాశారని పలువురు ఆరోపిస్తున్నారు. వీరంకి శ్రీనివాసరావు తన ఇంటికి సంబంధించి 2023-24 సంవత్సరానికి రూ.187లను 2025 మార్చి 16వ తేదీన చెల్లించగా, 300428 నెంబరు గల రశీదుని పంచాయతీ వారు ఇచ్చారు. కానీ ఈ రూ.187లను పంచాయతీలో జమ చేయకపోవటంతో శ్రీనివాసరావు బకాయి ఉన్నట్టు స్వర్ణ పంచాయితీ వెబ్‌సైట్‌లో చూపుతోంది. మరొక ప్రముఖ వ్యక్తి నుంచి ఇంటి పన్ను డబ్బులు మిగతా 6లో..

# అంతా షో!

- రైతుల కష్టాలను గాలికొదిలేసిన వైఎస్ జగన్
- విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి-65పై రోడ్ షో
- ఆయా నియోజకవర్గాల్లో వైసీపీ ఇన్‌చార్జిల బలప్రదర్శన
- మధ్యాహ్నం వరకే అనుమతి.. అయినా రాత్రి వరకు సాగిన పర్యటన
- సీఐపై మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ దుర్భాషలు
- మచిలీపట్నంలో పోలీసులతో పేర్ని కిట్టు వాగ్వాదం



గూడూరు మండలం ఆకుమర్రులో పొలానికి వెళ్లే దారిలో పోలీసులతో గొడవ పడుతున్న వైసీపీ కార్యకర్తలు (ఇన్‌సెట్‌లో) దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్

మొంథా తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలను పరిశీలించేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్ జిల్లాలో మంగళవారం చేపట్టిన పర్యటన తీరుపై అనేక విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రైతుల కష్టాలను గాలికొదిలేసి విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి-65పై రోడ్ షోకే వైసీపీ అధినేత ప్రాధాన్యత ఇచ్చినట్టు కనిపించింది. సార్వత్రిక ఎన్నికల తర్వాత తొలిసారి తమ నియోజకవర్గాల్లోకి వస్తున్నారని ఆయా నియోజకవర్గ ఇన్‌చార్జిలు భారీగా జన సమీకరణ చేసి బలప్రదర్శన చూపారు. దీంతో మధ్యాహ్నమే పూర్తి కావాల్సిన కార్యక్రమం రాత్రి వరకు నిబంధనలకు విరుద్ధంగా సాగింది. పామర్రు, మచిలీపట్నం నియోజకవర్గాల్లో కైలే అనిల్ కుమార్, పేర్ని కిట్టు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. జగన్ పర్యటన పేరుతో ఎక్కడికక్కడ రోడ్లను బ్లాక్ చేయడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జగన్ పర్యటన అంతా ఓ షో అంటూ పెదవి విరిచారు.

**ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం :** తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలను మాజీ సీఎం వైఎస్ జగన్ పరిశీలించేందుకు వైసీపీ నేతలు అధికారుల నుంచి అనుమతులు తీసుకున్నారు. పెడన నియోజకవర్గం గూడూరు మండలం రామరాజుపాలెం అడ్డరోడ్డు, ఆకుమర్రు లాకుల వద్ద పొలం సందర్శన, మీడియా సమావేశం, అనంతరం మిగతా 6లో..

విమానాశ్రయం అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ



# అభివృద్ధి పనులు వేగవంతం

- కలెక్టర్ డీకే బాలాజీ

**గన్నవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి):** గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం విస్తరణ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. విమానాశ్రయం విశిష్ట అతిథుల భవనంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఎయిర్ పోర్టు, రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, డ్రైనేజీ, ఆర్‌డబ్ల్యూఎస్, రహదారులు, భవనాలు తదితర శాఖల అధికారులతో మంగళవారం సమీక్షించారు. న్యూ ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ భవన నిర్మాణం, సీలింగ్, ఎలివేషన్ పనులు, వాహనాల పార్కింగ్ ఏరియా, డ్రైనేజీ, ఇతర మౌలిక వసతుల ఏర్పాటు తదితర అభివృద్ధి పనులు, భూసేకరణ సమస్యలపై చర్చించారు. ఈ క్రమంలో విమానాశ్రయ అధికారులు విమానాశ్రయంలో జరుగుతున్న పనుల పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ విమానాశ్రయ విస్తరణ అభివృద్ధి పనులను అత్యంత ప్రాధాన్యతగా భావించి నిర్ణీత సమయానికి పూర్తి చేసే దిశగా అధికారులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ సూచనల మేరకు అవసరమైన పనుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి అందించాలని చెప్పారు. అదేవిధంగా విమానాశ్రయ విస్తరణలో భాగంగా నెలకొన్న భూ సమస్యలు, కోర్టు వివాదాలు, ఏలూరు కాల్వపై వంతెన మిగతా 6లో..

# మనోజ్.. మహా ముదురు

- నకిలీ మద్యం తయారీ కేసులో కీలకం
- 'అద్దేపల్లి'తో ఆది నుంచీ అనుబంధం
- 1.80 లక్షల ప్లాస్టిక్ సీసాలకు మూతలు సరఫరా
- ఆన్‌లైన్‌లో ఆర్డర్ వచ్చిందని బుకాయింపు
- అద్దేపల్లి బ్రదర్స్ నుంచి భారీగా ముడుపులు

ఎవరైనా ఏదైనా వ్యాపారం చేసినప్పుడు ఆర్డర్లు రావడం సాధారణం. భారీగా సరుకు సరఫరా చేయాలని ఆర్డర్లు వచ్చినప్పుడు అంత మొత్తం ఎందుకో ఆరా తీస్తారు. ఇది వ్యాపారుల లక్షణం. వన్‌టౌన్‌లోని పులిపాక వారి వీధిలో ప్లాస్టిక్ సీసాల మూతలను విక్రయించే వ్యాపారి మాత్రం భారీగా ఆర్డర్ వచ్చిందనగానే ఎలాంటి ఆరా తీయకుండానే సరుకు సరఫరా చేశాడు. ఆయనే మనోజ్‌కుమార్ జైన్. నకిలీ మద్యం తయారీ కేసులో ఏ20 నిందితుడు.

**(ఆంధ్రజ్యోతి-విజయవాడ):** నకిలీ మద్యం తయారీ కేసులో వ్యాపారి మనోజ్‌కుమార్ జైన్‌ను సిట్ అధికారులు ఏ20గా చేర్చారు. ఆయనను రెండు రోజుల క్రితం అదుపులోకి తీసుకోగానే అస్వస్థతకు గురయ్యాడు. దీంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి 41ఏ నోటీసు ఇచ్చి సరిపెట్టారు. ఎక్సైజ్ పోలీసుల విచారణలో మనోజ్‌కుమార్ జైన్ నకిలీ మద్యం తయారీకి ఎలా సహకరించాడన్న వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఎలాంటి అనుమతులు లేకుండా చీకట్లో జరిగే



పోలీసులు అరెస్టు చేస్తుండగా అనారోగ్యానికి గురైన మనోజ్

కార్యకలాపాలకు సహకరించడం మనోజ్‌కుమార్‌కు అలవాటని పోలీసులు గుర్తించారు.

### ఆన్‌లైన్ ముసుగులో..

అద్దేపల్లి జనార్దనరావు, జగన్మోహనరావులు నకిలీ మద్యం తయారీకి శ్రీకారం చుట్టినప్పటి నుంచి మనోజ్‌కుమార్ జైన్‌తో సంబంధాలు నడిపినట్టు సిట్ అధికారులు గుర్తించారు. ఇప్పుడు ఈ కేసు నుంచి తప్పించుకోవడానికి ఆయన రకరకాల ప్రయత్నాలు చేస్తున్నాడు. మనోజ్‌కుమార్ పులిపాక వారి వీధిలో ఉన్న కొఠారి కాంప్లెక్స్‌లో ప్లాస్టిక్ మూతల వ్యాపారం చేస్తున్నాడు. జనార్దనరావు తయారు చేయించిన నకిలీ మద్యం పోసిన సీసాలపై అమర్చే మూతలను కొన్నేళ్లుగా మనోజ్‌కుమార్ సరఫరా చేస్తున్నాడు. అద్దేపల్లి అన్నదమ్ములు 2021 కొవిడ్ సమయంలో నకిలీ మద్యం తయారీని మొదలుపెట్టిన విషయం తెలిసిందే. తొలుత హైదరాబాద్‌లోని నిజాంపేట నుంచి ఇక్కడికి ప్లాస్టిక్ టిన్నుల్లో నాన్ డ్యూటీ పెయిడ్ మిగతా 6లో..

### మూతలపై ముద్రణ

జనార్దనరావు సోదరులు సీసాలను ఒకచోట నుంచి కొంటే, వాటిపై బిగించి మూతలను మనోజ్‌కుమార్ జైన్ నుంచి కొన్నారు. మూతలను సరఫరా చేయడమే కాకుండా వాటిపై నకిలీ మద్యం బ్రాండ్ల పేర్లను ముద్రించినట్టు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. ఇలా చేసినందుకు అద్దేపల్లి అన్నదమ్ముల నుంచి మనోజ్ భారీగానే ముడుపులు అందుకున్నాడు. అద్దేపల్లి సోదరులతో 2021వ సంవత్సరం నుంచి మనోజ్ తన బంధాన్ని కొనసాగిస్తున్నాడు. అద్దేపల్లి సోదరులను పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారించినప్పుడు ఈ విషయాలు బయటపడ్డాయి. తెలంగాణాతో పాటు పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో ఎలాంటి అనుమతులు లేకుండా రసాయనాలు తయారుచేస్తున్న ముఠాకు మనోజ్‌కుమార్ ఈవిధంగానే సహకరించాడు. భారీగా మూతలు సరఫరా చేయడంతో పాటు వాటిపై ముద్రణను విజయవాడలో చేయించాడు. ఈ కేసుల్లో అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. ఇప్పుడు అద్దేపల్లి అన్నదమ్ములతో ఉన్న ముద్రణ అనుబంధం బయటపడింది.



## మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపి

## నేడు దుర్గగుడిలో గిరిప్రదక్షిణ, కోటి దీపోత్సవం

8

## 'కొల్లేరు' నిర్వహణ అథారిటీ ఏర్పాటు

- సమన్వయంతో నిబంధనల అమలుకు నిర్దేశం

6

# మొత్తమొంథా నాశనం

- జిల్లాలోని అన్ని పంటలపై తుఫాను, వరద ప్రభావం
- నేలకొరిగిన వరి, మిర్చి, రంగుమారిన పత్తి
- కంద, పసుపు, బొప్పాయి తోటలకు కూడా భారీనష్టం
- మొలకలు వచ్చిన పంటలు చూసి కన్నీరు పెడుతున్న రైతన్న
- చెమ్మగిల్లిన కళ్లతో సహాయం కోసం ఎదురుచూపులు
- పనులు లేక అల్లాడిపోతున్న వ్యవసాయ కూలీలు
- ఎన్టీఆర్ జిల్లాలో 'ఆంధ్రజ్యోతి పొలంబాట'లో కన్నీటి కథలు
- రైతులతో మాట్లాడి.. వారి సమస్యలు తెలుసుకుని..

6

దెబ్బతిన్న కూరగాయల పంటల్ని దున్నేసి మిర్చి కోసం భూమిని సిద్ధం చేస్తున్న రైతులు




ఆంధ్రజ్యోతి పొలం బాట

ఆరుగాలం శ్రమించి పండించిన పంట కళ్ల ముందే కరిగిపోయింది. కోతకు వచ్చే దశలో ఉన్న వరి తుఫాను, వరదల తాకిడికి నేలకొరిగిపోయింది. పత్తి చిత్తుచిత్తుగా మారింది. మిర్చి మొక్కలు కూలబడిపోగా, మొక్కజొన్న ఎండిపోయింది. కంద, పసుపు, బొప్పాయి తోటలు నాశనమైపోయాయి. నిస్సహాయ స్థితిలో ఉన్న రైతన్న ఏం చేస్తాడు? కన్నీటితో కలవరపడిపోతున్నాడు. మొంథా తుఫాను, ఆ తర్వాత వచ్చిన వరదల తాకిడికి జిల్లాలోని దాదాపు అన్ని పంటలు దెబ్బతిన్నాయి. రంగుమారిన, దెబ్బతిన్న పంటలను తీయటానికి కూడా వీల్లేని దుస్థితి నెలకొనడంతో అన్నదాతలు ఆర్తనాదాలు మిన్నంటుతున్నాయి. రైతులతో పాటు వ్యవసాయ కూలీల పరిస్థితి కూడా దారుణంగా మారడంతో 'ఆంధ్రజ్యోతి' బృందం మంగళవారం పొలంబాట పట్టింది. తిరువూరు, గంపలగూడెం, ఏ.కొండూరు, విస్సన్నపేట, రెడ్డిగూడెం, మైలవరం, జి.కొండూరు, విజయవాడ రూరల్, ఇబ్రహీంపట్నం, కంచికచర్ల, వీరులపాడు, నందిగామ, పెనుగంచిప్రోలు, వత్సవాయి, జగ్గయ్యపేట వరకు సుమారు 400 కిలోమీటర్ల వరకు సాగిన ఈ పొలంబాటలో ఎంతమంది రైతులు, వ్యవసాయ కూలీల కన్నీటి కథలు వినిపించాయి.

## సముద్ర స్నానానికి సర్వం సిద్ధం


- నేడు మంగినపూడి బీచ్‌లో కార్తీక పౌర్ణమి పూజలు
- రెండు లక్షల మంది భక్తులు వస్తారని అంచనా
- ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా అధికారులు
- తెల్లవారుజామున సముద్ర హారతి ఇవ్వనున్న మంత్రి రవీంద్ర



ఏర్పాటు చేసిన స్టేజ్

**మచిలీపట్నం టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి):** కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని మంగినపూడి బీచ్‌లో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సముద్ర స్నానాలకు బుధవారం రెండు లక్షల మంది వరకు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశాలతో రెవెన్యూ, పోలీస్, మెరైన్, పంచాయతీరాజ్ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తెల్లవారు జామున 5 గంటలకు మంత్రి రవీంద్ర సముద్ర హారతి ఇవ్వనున్నారు.

# కన్నీటి వ్యథ!

ఆంధ్రజ్యోతి పొలం బాట

కంచికచర్లలో దెబ్బతిన్న పత్తి చేను, దూది గింజల్లో వచ్చిన మొలకలు

ఇబ్రహీంపట్నం మండలం తిలోచనాపురంలో నేలవాలిన వరి పంట

పల్లెల్లో అన్నదాత మోము విచారంతో నిండింది. రవ్వంత సంతోషం కూడా కనపడటం లేదు. ఆరుగాలం పడిన కష్టం వృథా కావటం, పంటలు చేతికి అందకుండా పోవటంతో రైతులు విలవిలలాడుతున్నారు. ఎడతెగని వర్షాలు, మొంథా తుఫాను, వరదల వల్ల పత్తి, మిర్చి, మొక్కజొన్న, మాగాణి వరితో పాటు కంద, పసుపు, బొప్పాయి తోటలు నిలువునా దెబ్బతిన్నాయి. ఇంకా వర్షాలు పడుతూనే ఉన్నాయి. ముంపు సమస్య మాత్రం వీడటం లేదు. రంగు మారిన, దెబ్బతిన్న పంటలను కూడా తీయటానికి వీలుపడని దైన్య పరిస్థితుల్లో పొలాల్లో అష్టకష్టాలు పడుతున్న రైతులను చూస్తుంటే హృదయం బరువెక్కి, కళ్లు చెమ్మగిల్లుతున్నాయి. రైతులతో పాటుగా వ్యవసాయ కూలీల పరిస్థితి కూడా దయనీయంగా తయారైంది.

- అన్నదాతకు అపార నష్టం మిగిల్చిన మొంథా
- వరి, పత్తి, మిర్చి, కంద, పసుపు, బొప్పాయి తోటలకు భారీ నష్టం
- మొలకలు వచ్చిన పంటలు.. భోరున విలపిస్తున్నరైతన్నలు
- చెమ్మగిల్లిన కళ్లతో ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూపులు
- ఎన్టీఆర్ జిల్లాలోని తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో 'ఆంధ్రజ్యోతి పొలంబాట'

(ఆంధ్రజ్యోతి, కంచికచర్ల/ఇబ్రహీంపట్నం)

## పత్తి సర్వనాశనం

జిల్లాలో 81,875 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. కౌలుతో కలుపుకుని ఎకరానికి రూ.50 వేలకు పైగా పెట్టుబడి పెట్టారు. ఈ ఏడాది ఎడతెగని వర్షాలు పత్తి పంటను సర్వనాశనం చేశాయి. చేలల్లో తేమ ఆరకపోవటం వల్ల బూజు తెగులు వ్యాపించింది. చెట్టు చివరి వరకూ కాయలు నల్లగా మారాయి. కాయలు బిగుసుకుపోయి సరిగ్గా విచ్చుకోవటం లేదు. నాణ్యమైన పత్తి



రావటం లేదు. ప్రస్తుతం చేల నుంచి గుడ్డి, కాయ పత్తి మాత్రమే వస్తున్నది. ముందు కూడా మంచి పత్తి వచ్చే సూచనలు కనిపించడం లేదు. కొద్దిపాటి దిగుబడి కూడా రావటం కష్టమే. పంటలకు జరిగిన నష్టం అంతా ఇంతా కాదు. అయితే పత్తి నష్టం వివరాలను నమోదు చేసేందుకు అధికారులు వెనుకాడుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

## మిర్చిని దెబ్బతీసిన మొంథా తుపాను

సుమారుగా 25 వేలఎకరాల్లో రైతులు మిర్చి సాగు చేశారు. ఎకరానికి రూ. లక్ష వరకు పెట్టుబడి పెట్టారు. తోటలు పూత, పిందె దశలో ఉండగా, మొంథా తుఫాన్ తీవ్రంగా దెబ్బతీసింది. గాలులకు చెట్లు ఒరిగాయి. పూత, పిందెలు రాలిపోయాయి. ఒరిగిన చెట్లను కూలీలతో నిలదొక్కిస్తున్నారు. తోటలు ఎదుగుతుండగా దెబ్బతినటం వల్ల మెత్తదనం కోల్పోతుందని రైతులు అంటున్నారు. గతంలో మాదిరిగా తోటలు కళగా ఉండవని, దీని వల్ల ఆశించిన దిగుబడులు రావటం కష్టమని రైతులు చెబుతున్నారు. మార్కెట్లో కొద్ది రోజుల నుంచి పుంజుకొంటున్న మిర్చి ధరలు రైతులకు ఊపిరిపోస్తున్నాయి.

## మొక్కజొన్న ఎండిపోయింది

నందిగామ డివిజన్ పరిధిలోనే 10 వేలఎకరాలకు పైగా రైతులు మొక్కజొన్న సాగు చేశారు. 25శాతం విస్తీర్ణంలో మాత్రమే నూర్పిళ్లు జరిగాయి. రోజూ కురుస్తున్న వర్షాల వల్ల నూర్పిళ్లు జరగటం లేదు. తేమ ఆరకపోవటం వల్ల యంత్రాలు సైతం చేలల్లోకి దిగటానికి వీలుపడటం లేదు. నెలరోజుల నుంచి నూర్పిళ్లు జరగటం లేదు. పంటంతా చేలల్లోనే ఉండిపోయింది. మరో పదిరోజుల వరకు చేలల్లో దిగే పరిస్థితి లేదు. పంట ఇంటికి వస్తుందో లేదో అర్థం కావటం లేదు. పలుచోట్ల మొక్కజొన్న పంట ఎండిపోయింది.

## నామమాత్రంగానైనా దక్కని వరి పంట

జిల్లాలో ఎత్తిపోతల పథకాలు, చెరువులు, కాల్వలు ఆయకట్టులో 1.30 లక్షల ఎకరాల్లో మాగాణి వరి సాగైంది. పలు ప్రాంతాల్లో వరి ఈనింది. గింజలు పాలు పోసుకుని గట్టిపడుతున్నాయి. కొద్ది రోజుల్లో కోయాల్సి ఉంది. ఇంకొన్ని ప్రాంతాల్లో పొట్ట దశలో ఉంది. ఈ నేపధ్యంలో తుపాను ఈదురుగాలులకు వరి వెన్ను విరిగి పడిపోయింది. ఇంకా ముంపు తొలగలేదు. తలవాల్చిన వరి నీటిలో నానుతూనే ఉంది. బాగా నష్టం వాటిల్లింది. ముంపు నీటిని బయటకు పంపేందుకు రైతులు నానా కష్టాలు పడుతున్నారు. ఏదో సమయంలో వర్షం పడుతుంటంతో ఇక వరి పంట నామమాత్రంగానైనా చేతికి దక్కుతుందన్న ఆశ లేకుండా ఉందని రైతులు వాపోతున్నారు.

## మొలకలతో పంటలు సర్వనాశనం

నేలవాలిన వరికి మొలకలొచ్చాయి. పాలు పోసుకునే స్థితిలో ఉన్న వరి గింజ అవిసిపోయింది. రాలిన పత్తి పంటలోని గింజలు మరల పత్తి సాగు చేసినట్టు మొలకలు వచ్చాయి. మినుము పంట సర్వనాశనమైంది. కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. ఎవరిని కదిలించినా దైన్యం నిండిన కళ్లతో ఏం చేస్తామయ్యా ఈ ఏడాది అయిపోయాం. చెడు వానలు మమ్మల్ని ముంచేశాయి. కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా దక్కని స్థితిలో ఉన్నాం. ప్రభుత్వం ఆదుకుంటుందని ఎదురు చూస్తున్నాం. అంటూ 'ఆంధ్ర



జ్యోతి-పొలంబాట'లో గోడు వెళ్లబోసుకున్నారు.

అధిక వర్షాలు, తుపాను ప్రభావంతో పంటలకు చేటు మొంథా తుపాన్ రైతుల్ని ముంచేసింది. మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లోని మైలవరం, జి.కొండూరు, రెడ్డిగూడెం, ఇబ్రహీంపట్నం, విజయవాడ రూరల్, తిరువూరు, ఎ.కొండూరు, విస్సన్నపేట, గంపలగూడెం మండలాల్లో మంగళవారం 'ఆంధ్రజ్యోతి నిర్వహించిన పొలంబాటలో అన్నదాతలు పంటలకు జరిగిన నష్టాన్ని వివరించారు. పంటలు ఇంతలా దెబ్బతిన్నా నష్టం అంచనా ఎంత మేర వేశారో తెలియదని వాపోయారు. కొన్ని మండలాల్లో ఇప్పటికే దెబ్బతిన్న పంటలను దున్నేసి వేరే సాగుకు సమాయత్తమయ్యారు. పొలాల వైపు వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు కన్నెత్తి చూడలేదని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

## వీడని వానలు.. తొలగని ముంపు

మొంథా తుఫాను ముంపు నుంచి బయటపడి పంటలు కోలుకుంటాయని ఆశిస్తున్న రైతులకు నిరాశే మిగిలింది. ఆదివారం నాడు నందిగామ డివిజన్ పరిధిలో పది సెంటీమీటర్ల వర్షం కురిసింది. మంగళవారం కూడా జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి ప్రాంతాల్లో వర్షం పడింది. వర్షాల వల్ల ముంపు తొలగటం లేదు.

## కూలీలకు రెండు నెలలుగా పనుల్లేవు!

అధిక వర్షాలవల్ల రెండు నెలలుగా పనులు సాగటం లేదు. వివిధ పంటలు ముంపునకు గురికావటం వల్ల పనుల్లేవు. పెసర, మినుము, మొక్కజొన్న, మాగాణి వరి పంటల కోతలు, నూర్పిళ్లకు ఎక్కువగా యంత్రాలు వాడుతున్నారు. కూలీలతో పెద్దగా అవసరం ఉండటం లేదు. పనులు లేనందున చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి వచ్చింది.

### రైతులు ఏం కోరుతున్నారంటే..

- పంట నష్టం ఎన్యూమరేషన్‌లో అవకతవకలకు ఆస్కారం లేకుండా చూడాలి.
- సీసీఐ నిబంధనలు సడలించి మార్కెట్ యార్డుల్లో పత్తిని కొనాలి.
- దెబ్బతిన్న పత్తికి కూడా మద్దతు ధర రూ. 8,111లు అందించాలి.
- తక్షణమే మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.
- మార్కెట్లో గిట్టుబాటు ధర లేనందున పెసలు, మొక్కజొన్నను మద్దతు ధరకు కొనుగోలు చేయాలి.
- రబీ సీజన్‌కు సంబంధించి రాయితీపై విత్తనాలు, ఎరువులు అందించాలి.
- దెబ్బతిన్న పంటలను పూర్తిస్థాయిలో నమోదు చేయాలి.
- సీసీఐ కొనుగోలు కేంద్రాలు తెరవాలి. పాడైన పత్తిని మద్దతు ధరకు కొనాలి
- రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.
- పంటల బీమాతో పనిలేకుండా దెబ్బతిన్న పంటలకు బీమా వర్తింపచేయాలి
- నిజమైన సాగుదారులకు పంట నష్టపరిహారం అందించాలి.
- కౌలు కార్డులతో సంబంధం లేకుండా కౌలు రైతుల్ని ఆదుకోవాలి.

## అధికారుల తీరుపై రైతుల ఆగ్రహం

పంట నష్టం వివరాల సేకరణకు సంబంధించి అధికారుల తీరుపై బాధిత రైతులు మండిపడుతున్నారు. తూతూమంత్రంగా తప్పితే ఎన్యూమరేషన్ సక్రమంగా చేయటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. గ్రామాలకు రండి, పంట పొలాలను పరిశీలించండి, జరిగిన నష్టాన్ని రికార్డుల్లో నమోదు చేయండి. అంతేగాని ముందుగానే ఒక అంచనాకు వచ్చి నాయకుల ఒత్తిళ్ల మేరకు పక్షపాతంతో నష్ట జాబితాలు రూపొందించవద్దని ముక్తకంఠంతో విజ్ఞప్తి చేస్తున్నారు.

## రబీ సీజన్ ఆలస్యం

ఈ ఏడాది రబీ సీజన్ ఆలస్యం కానున్నది. సాధారణంగా అక్టోబరు నుంచి రబీ సీజన్ వ్యవసాయపనులు ముమ్మరంగా జరుగుతుంటాయి. అలాంటిది నవంబరు నెల మొదటి వారం గడిచిపోతున్నప్పటికీ పనులు సాగటం లేదు. పొలాలు దున్ని, బాగుచేయాల్సి ఉంది. ఇంకా పొలాలు ఆరలేదు. మొక్కజొన్న కోయలేదు. ఈ పరిస్థితుల్లో రబీ సీజన్‌పై రైతులు తీవ్ర ఆందోళనతో ఉన్నారు.

### పత్తి పూర్తిగా పోయింది

- ముప్పాళ్ల గంటయ్య, కొత్తపేట



ఎకరం రూ.12వేల వంతున ఎకరంన్నర కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశా. అధిక వర్షాలకు చేలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇప్పటికి కేవలం 70కిలోల పత్తి మాత్రమే వచ్చింది. చెట్టు చివరి దాకా కాయలు దెబ్బతిన్నాయి. కాయ, గుడ్డి పత్తి కూడా అంతంత మాత్రంగానే వస్తున్నది.

### పత్తి తీసేందుకు కూలీలు రావటం లేదు

- షేక్ షహనాబీ, గనిఆత్కూరు



పత్తిచేలు నీటిలోనే నానుతున్నాయి. కాయ, గుడ్డి పత్తి తీయటానికి కూలీలు రావటం లేదు. బురదగా ఉన్నందున కాళ్లు ఫంగస్ వ్యాధితో ఎర్రబారుతున్నాయి. చేతులు కూడా దెబ్బతింటున్నాయి. ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కూలి రూ. రెండు వందలు. దెబ్బతిన్న పత్తి చేలల్లోనే మూలుగుతున్నది.

### పసుపు కుళ్లిపోతోంది

- తేలుకుంటి నాగేశ్వరరావు, కొల్లికుళ్ల



మూడెకరాల్లో పసుపు పంట సాగుచేశా. ఎకరానికి రూ. 70 వేలు పెట్టుబడి అయింది. అధిక వర్షాల వల్ల తోట ముంపునకు గురైంది. రోజుల తరబడి నీళ్లు నిల్వ ఉండటం వల్ల వేరుకుళ్లు తెగులు వ్యాపిస్తున్నది. చెట్లు కూడా నిలువునా ఎర్రబడి చచ్చిపోతున్నాయి. దీని వల్ల దిగుబడి గణనీయంగా తగ్గనున్నది. పెట్టుబడి రావటం చాలా కష్టం.

### బొప్పాయి చెట్లు చచ్చిపోయాయి

- పాందూరు వెంకటరమణ, అనిగండ్లపాడు



2.5 ఎకరాల్లో బొప్పాయి సాగు చేశాను. రూ. లక్షకు పైగా పెట్టుబడి అయింది. చెట్లు బాగా ఎదిగాయి. మంచి కాపు వచ్చింది. కాయలు సైజు వస్తున్నాయి. అధిక వర్షాలు, మొంథా తుఫాన్ వల్ల తోట అంతా దెబ్బతిన్నది. ఈదురుగాలులకు చెట్లు పడ్డాయి. ఆకులతో పాటుగా చెట్లు ఎర్రబడ్డాయి. పిందెలు రాలిపోతున్నాయి. తోట పరిస్థితి చూస్తుంటే గుండె తరుక్కుపోతున్నది. ఏం చేయాలో తోచటం లేదు.

### మొక్కజొన్న దిగుబడి తగ్గింది

- చావా వంశీకృష్ణ, కొండూరు



మొక్కజొన్న 19 ఎకరాల్లో, మాగాణి వరి 25 ఎకరాల్లో సాగు చేశా. అధిక వర్షాల వల్ల దిగుబడి బాగా తగ్గింది. ఎకరానికి 25 నుంచి 30 క్వింటాళ్లు రావల్సి ఉండగా, కేవలం 15 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. అది కూడా గింజతడవటం వల్ల మంగు వచ్చింది. మద్దతు ధర క్వింటా రూ.24 వందలు ఉండగా, రూ.17 వందలకు అమ్ముకోవాల్సి వచ్చింది. మాగాణి వరి కూడా తుఫాను వల్ల బాగా దెబ్బతిన్నది.

### ప్రభుత్వం ఆదుకోవాలి

- కడియాల వెంకటేశ్వరరావు జి.కొండూరు



50 ఎకరాల్లో పత్తి.. ఆరు ఎకరాల్లో బెండ, నాలుగు ఎకరాల్లో వంగ సాగు చేశాను. పత్తికి పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదు. వర్షాలకు పూర్తిగా పాడైంది. ఉన్న పత్తి తీత ఖర్చులు పెరిగాయి. బెండలు పాడయ్యాయి. దున్నేసి మిర్చి సాగు చేస్తున్నా. ప్రభుత్వం పంట నష్టం అంచనా పూర్తిస్థాయిలో చేసి ఆదుకోవాలి.

# ఇంటి పన్నుల్లోనూ చేతివాటం!

(5వ పేజీ తరువాయి)

తీసుకుని, రశీదు మరలా ఇస్తామని చెప్పి రశీదు ఇవ్వకుండా, పంచాయతీలో జమ చేయకుండా సొంతానికి వాడేసుకున్నారు. ఇలా అనేక మంది వద్ద మూడు సంవత్సరాల నుంచి ఇంటిపన్నులను ఎవరి ఇష్టం వచ్చినట్టు వారువాడేసుకుంటూ పంచాయతీకి నష్టం కలిగిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు నిక్కచ్చిగా పూర్తిస్థాయి విచారణ జరిపితే రూ.లక్షల్లో అక్రమాలు తేలే అవకాశం ఉంది.

### పంచాయతీలో ఇష్టారాజ్యం

- వీరంకి శ్రీనివాసరావు, తోట్లవల్లూరుల



తోట్లవల్లూరు పంచాయతీలో అవినీతి పెరిగిపోయింది. ఎవరి ఇష్టారాజ్యం వారిదయింది. నాకు రెండు అన్యాయాలు జరిగాయి. 2023-24లో ఇంటి పన్ను స్వయంగా చెల్లించాను. ఆ డబ్బులను తినేశారు. ఇపుడు 2023-24 ఇంటి పన్ను చెల్లించాలంటున్నారు. నా దగ్గర ఒరిజినల్ రశీదు ఉంది. అలాగే 2024-25 ఇంటి పన్ను చెల్లించేందుకు వెళితే ఎవ్వరో వస్తే బిల్లు కట్టించుకుని రశీదు అతనికి ఇచ్చామని చెప్పారు. నా ఇంటి పన్ను రశీదుతో రేపు ఎవ్వరైనా అక్రమాలకు పాల్పడితే ఎవ్వరు బాధ్యత వహిస్తారో చెప్పాలంటే సమాధానం లేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశా. పంచాయితీ కార్యదర్శి పోలీసులు నాకు న్యాయం చేయలేదు.

### కార్యదర్శిదే బాధ్యత




- పెనుమత్స రాధిక, సర్పంచ్, తోట్లవల్లూరు

తోట్లవల్లూరు పంచాయతీలో అవినీతి ఆరోపణలకు కార్యదర్శి బాధ్యత వహించాలి. ఆయనే పర్యవేక్షణాధికారి, ఈ అవినీతిలో తనకెలాంటి సంబంధం లేదు.

### అన్యాయం జరిగితే అర్జీలు ఇవ్వండి

ఆర్.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి

ఈ ఏడాది సెప్టెంబర్ 6వ తేదీన ఇక్కడ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించా. జూనియర్ అసిస్టెంట్ సునీల్‌కుమార్ అన్ని నిబంధనలు ఉల్లంఘించాడు. చలానా కట్టి పంచాయతీకి చెల్లించకుండా నిధులను వాడేందుకు నిబంధనలు ఒప్పుకోవు. నేను రాకముందు వసూలు చేసిన బిల్లులను పంచాయతీకి కట్టలేదు. నా స్టాంప్ ముద్ర వేసి సునీల్‌కుమార్ సంతకం చేసి అక్రమంగా అద్దెదారులకు రశీదులు ఇచ్చాడు. ఇంటి పన్నుల్లో అన్యాయం జరిగిందన్న వారు వచ్చి తనకు అర్జీలు అందించాలి.




కార్యదర్శి స్టాంప్‌కు జూనియర్ అసిస్టెంట్ సునీల్ సంతకం

# తుఫాను వెళ్లాక జగన్ రైతు పరామర్శలా..!

- మంత్రి పార్థసారథి ఎద్దేవా

**గన్నవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) :** తుఫాన్ వచ్చి వెళ్లిపోయిన తరువాత జగన్ రైతులను పరామర్శించటం హాస్యాస్పదంగా ఉందని మంత్రి కొలుసు పార్థసారథి ఎద్దేవా చేశారు. హైదరాబాద్ నుంచి వచ్చిన మంత్రి గన్నవరం విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడుతూ, జగన్ చేయని పనులను చేసినట్టు చెప్పుకోవటం విడ్డూరంగా ఉందన్నారు. మొంథా తుపానుకు దెబ్బతిన్న పంటలకు నిబంధనల ప్రకారం నష్ట పరిహారం అందజేస్తామన్నారు. అబద్ధాలతో రాజకీయం చేయటం మంచిది కాదని జగన్‌కు హితవు పలికారు. మొంథా తుఫాను ముందస్తు చర్యలగురించి దేశమంతా చంద్రబాబును మెచ్చుకుంటుందని.. కానీ జగన్ బురదజల్లే కార్యక్రమం చేస్తున్నారన్నారు.

# కుల, చేతివృత్తిదారులకు శాశ్వత ఉపాధి

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

**గొల్లపూడి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) :** ప్రస్తుత పోటీ ప్రపంచంలో కుల, చేతివృత్తిదారులు నిలదొక్కుకునేలా ఆధునిక పరికరాలు అందజేసి, వారికి శాశ్వత ఉపాధి కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్. సవిత స్పష్టంచేశారు. కార్పొరేషన్ చైర్మన్లకు నిధులు, విధులతో పాటు వారి గౌరవాన్ని పెంపొందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. బీసీ కులాల కార్పొరేషన్ చైర్మన్లతో ఆత్మీయ సమావేశాల సందర్భంగా విజయవాడలోని గొల్లపూడి బీసీ భవన్‌లో మంగళవారం ఏడు కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లతో మంత్రి భేటీ అయ్యారు. ఆదరణ 3.0 పథకం అమలులో భాగంగా కుల వృత్తులకు ఏవిధమైన పరికరాలు కావాలో..? ఆయా కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్ల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, టీడీపీతోనే బీసీలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక గుర్తింపు లభించిందన్నారు. నాడు అన్న ఎన్టీఆర్, నేడు సీఎం చంద్రబాబు బీసీల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారన్నారు. గతంలో ఆదరణ, ఆదరణ 2.0 అమలు చేసిన సీఎం చంద్రబాబు ఇప్పుడు రూ.1000 కోట్లతో ఆదరణ 3.0 పథకానికి శ్రీకారం చుట్టారని మంత్రి వెల్లడించారు.



మంత్రి సవితకు వినతి పత్రం అందజేస్తున్న నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లు

### ఆధునిక పరికరాలతో శాశ్వత ఉపాధి

బీసీ కులాల్లో ఉన్న చేతివృత్తిదారులకు శాశ్వత ఉపాధి కల్పించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారని మంత్రి సవిత తెలిపారు. ప్రస్తుత అభిరుచులకు అనుగుణంగా చేతి, కుల వృత్తులకు మేలు కలిగేలా ఆధునిక పరికరాలు అందజేసేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని ఏయే వృత్తులకు ఏయే పరికరాలు కావాలో..? వివరాలు అందజేయాలని చైర్మన్లను, డైరెక్టర్లను కోరారు. ఇప్పటికే క్షేత్రస్థాయి నుంచి యూనిట్ల ఏర్పాటులో ఆధునిక పరికరాలు అందజేసే అంశంపై వివరాలు సేకరించామన్నారు. చైర్మన్లు, డైరెక్టర్ల నుంచి అభిప్రాయాలు సేకరించి సీఎం చంద్రబాబుకు నివేదించనున్నట్టు మంత్రి వెల్లడించారు. 16 నెలలకాలంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత చైర్మన్లపైనా, డైరెక్టర్లపైనా ఉందన్నారు. అనంతరం ఆయా కార్పొరేషన్ల వారీగా మంత్రి ముఖాముఖి సమావేశం నిర్వహించి, వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. సమావేశంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, ఆయా కులాల కార్పొరేషన్ చైర్మన్లు, బీసీ సంక్షేమ శాఖాధికారులు పాల్గొన్నారు.

# అంతా షో!

(5వ పేజీ తరువాయి)

మచిలీపట్నం సౌత్ మండలంలోని సీతారామపురం, బొంతా వెంకన్న తోట, ఎస్ఎన్ గొల్లపాలెంలో పొలాలను పరిశీలించాల్సి ఉంది. కానీ పంట పొలాల సందర్శన కన్నా జాతీయ రహదారిపై రోడ్ షోకే అధినేత అధిక ప్రాధాన్యత ఇచ్చారు. పెనమలూరు నియోజకవర్గం నుంచి వైఎస్ జగన్ రోడ్ షోగా తరలిరావడం, వైసీపీ కార్యకర్తలు విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి- 65పై ద్విచక్ర వాహనాలతో విన్యాసాలు చేయడంతో ప్రయాణికులు ఇబ్బందుల పాలయ్యారు. పామర్రు నియోజకవర్గం బల్లిపర్రులో దెబ్బతిన్న వరి దుబ్బులను రైతులు తీసుకువచ్చి చూపారు. రైతులకు నష్టం జరిగిందని, మీ తరపున పోరాటం చేస్తానని జగన్ అన్నారు. గోపవానిపాలెం అడ్డరోడ్డు వద్ద వైసీపీ కార్యకర్తలు జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాలతో విన్యాసాలు చేస్తుంటే పోలీసులు వాహనాల తాళాలను లాక్కున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అక్కడకు చేరుకుని తాళాలు ఇవ్వాలని సీఐ చిట్టిబాబుతో వాగ్వాదానికి దిగారు. ఆ తర్వాత మీడియా పాయింట్ వద్ద పోలీసులు తనను కొట్టారని మీడియా, ఇంటెలిజెన్స్ పోలీసులతో చెప్పడం గమనార్హం. ఉదయం ప్రారంభించిన రోడ్డు షో మధ్యాహ్నం 3 గంటలకు గూడూరుకు చేరుకుంది. అక్కడ మాజీ మంత్రి కొడాలి నాని, మాజీ ఎమ్మెల్యేలు వల్లభనేని వంశీ, సింహాద్రి రమేష్, దూలం నాగేశ్వరరావు, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక వైఎస్ జగన్‌తోపాటు రోడ్‌షోలో పాల్గొన్నారు. పెడన నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున జనాన్ని ఉదయం 10 గంటలకు గూడూరు వద్దకు తరలించడంతో మధ్నాహ్నం వరకు ఎండలో వారు అల్లాడిపోయారు. రామరాజుపాలెం క్రాస్‌రోడ్ నుంచి పలు గ్రామాలకు చేరేందుకు సింగిల్ రహదారి మాత్రమే ఉంది. గంటల తరబడి ఈ రహదారిపై స్థానిక గ్రామాల ప్రజలను వెళ్లనీయకుండా బారికేడ్‌లు ఏర్పాటు చేశారు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన పోలీసులను ఈ రహదారిపై బందోబస్తుగా పెట్టారు. ప్రజలను ఈ రహదారి గుండా సాయంత్రం వరకు వెళ్లనీయకపోవడంతో స్థానిక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

### ఆలస్యంగా ఆకుమర్రుకు..

పెడన నియోజకవర్గంలోని ఆకుమర్రు గ్రామంలో ఉదయం 11 గంటలకు పొలాలను పరిశీలిస్తారని చెప్పినా, ఈ గ్రామానికి సాయంత్రం 4.12 గంటలకు వైఎస్ జగన్ చేరుకున్నారు. అక్కడ పొలాన్ని పరిశీలించిన అనంతరం మీడియా పాయింట్‌కు ఆయన వచ్చే సమయంలో కొందరు జగన్ అన్నా రప్పా, రప్పా, సీఎం, సీఎం అంటూ నినాదాలు చేయడం గమనార్హం. ఆకుమర్రు వద్ద పొలానికి వెళ్లే సమయంలో పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను సైతం తోసివేసిన వైసీపీ కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తూర్పు గోదావరి, కడప జిల్లాల నుంచి వచ్చిన వైసీపీ రైతు విభాగం నాయకులు స్థానిక రైతులతో మాజీ సీఎం వచ్చినప్పుడు వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు పంటల బీమా వచ్చిందని, పంట నష్టపరిహారం ఇచ్చారని చెప్పాలని గంటల తరబడి వారికి శిక్షణ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత యూరియా బస్తాను రూ.500లకు కొనుగోలు చేశామని, ఈ ప్రభుత్వం రైతులను ఆదుకోవడం లేదని కూడా చెప్పాలని స్థానిక రైతులతో వివరించడం కనిపించింది. ఉయ్యూరు మండలం గండిగుంట దగ్గర జగన్ కాన్వాయ్‌లోని ఆ పార్టీ నేతల కార్లు ఢీ కొన్నాయి. మచిలీపట్నం మండలం ఎస్ఎన్ గొల్లపాలెం ఫ్లైఓవ ర్ వద్దకు మచిలీపట్నం నుంచి పెద్ద ఎత్తున ప్రజలను తరలించారు. పరిమితికి మించి ప్రజలను తరలించడంతో పోలీసులు వారిని నియంత్రించేందుకు ప్రయత్నించారు. దీంతో మచిలీపట్నం నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి పేర్ని కిట్టు పోలీసులతో వాగ్వాదానికి దిగాడు. జిల్లాలో వైఎస్ జగన్ పర్యటన అంతా షో అన్నట్టు సాగిందని విమర్శలు వ్యక్తమయ్యాయి.

# అభివృద్ధి పనులు వేగవంతం

(5వ పేజీ తరువాయి)

నిర్మాణం, రైతులకు పరిహారం చెల్లింపు వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. సమీక్ష అనంతరం జిల్లా కలెక్టర్ నిర్మాణంలో ఉన్న న్యూ ఇంటిగ్రేటెడ్ టెర్మినల్‌ను సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సమావేశంలో విమానాశ్రయ జనరల్ మేనేజర్ రామాచారి, డైరెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి, గుడివాడ ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, తహసీల్దార్ కేవీ శివయ్య, పంచాయతీరాజ్ ఎస్ఈ రమణరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సోమశేఖర్, రహదారులు భవనాల శాఖ ఈఈ లోకేశ్వరరావు పాల్గొన్నారు.

# మనోజ్.. మహాముదురు

(5వ పేజీ తరువాయి)

లిక్కర్‌ను తీసుకొచ్చి వివిధ పరిమాణాల్లో ఉన్న ప్లాస్టిక్ సీసాల్లో నింపేవారు. అందులో కొన్ని రసాయనాలు కలిపేవారు. ఇలా మద్యం పోసిన సీసాలపై బిగించడానికి అవసరమైన మూతలను మనోజ్‌కుమార్ జైన్ సరఫరా చేశాడు. సీసాలను మాత్రం గన్నవరం మండలంలోని పారిశ్రామికవాడలో ఉన్న ఓ ప్లాసిక్ట్ తయారీ పరిశ్రమ నుంచి కొన్నట్టు తెలిసింది. ఆ పరిశ్రమ యజమాని డి.శ్రీనివాసరెడ్డిని పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. ఈ సీసాలపై బిగించే మూతల సరఫరాలో మనోజ్‌కుమార్ జైన్ పేరు వెలుగులోకి వచ్చింది. ఎక్సైజ్ పోలీసులు అతడిని ప్రశ్నించినప్పుడు తెలివిగా సమాధానం చెప్పాడని తెలిసింది. తనకు ఆన్‌లైన్‌లో ఆర్డర్ వస్తే భారీ మొత్తంలో సరఫరా చేశానని చెప్పినట్టు సమాచారం. ఒక దఫాకు 80 వేల నుంచి లక్ష మూతలను సరఫరా చేసినట్టు పోలీసులు గుర్తించారు.

# 'కొల్లేరు' నిర్వహణ అథారిటీ ఏర్పాటు

- సమన్వయంతో నిబంధనల అమలుకు నిర్దేశం

**అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) :** జాతీయ వన్యప్రాణి బోర్డు స్టాండింగ్ కమిటీ సిఫారసు మేరకు ప్రభుత్వం కొల్లేరు సరస్సు నిర్వహణకు అథారిటీని ఏర్పాటు చేసింది. కొల్లేరు వన్యప్రాణుల అభయారణ్యం నిర్వహణ, చిత్తడి నేలల స్థిరమైన నిర్వహణ దీని లక్ష్యం. ఇందులో అన్ని కీలక విభాగాలకూ ప్రాతినిధ్యం కల్పిస్తూ అటవీశాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అథారిటీ చైర్మన్‌గా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వైస్‌చైర్మన్‌గా అటవీ, పర్యావరణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సభ్యులుగా రెవెన్యూ, మత్స్య, వ్యవసాయ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, జలవనరులశాఖ కార్యదర్శులతో పాటు అటవీముఖ్య దళాధికారి, వన్యప్రాణి విభాగం ముఖ్య వార్డెన్, వ్యవసాయ, మత్స్య, పంచాయతీరాజ్, పర్యాటక శాఖల డైరెక్టర్లు, పీసీబీ, ఇతర అధికారులతో కలిపి 26మందితో అథారిటీని నియమించారు. ఈ అథారిటీకి కొన్ని నిబంధనలను రూపొందించారు. ఈ అథారిటీ సమన్వయంతో పని చేస్తూ, కనీసం మూడు నెలలకోసారి సమావేశమై, సరస్సు పరిరక్షణపై సమీక్షించాలని నిర్దేశించారు. భవిష్యత్ ప్రయోజనాల కోసం దీర్ఘకాలిక వ్యూహాన్ని తయారుచేయడం, రామ్‌సర్ సైట్ కోసం సమగ్ర నిర్వహణ ప్రణాళికల తయారీ, పర్యావరణంపై ప్రతికూల ప్రభావం చూపకుండా కార్యకలాపాల నిర్వహణ, ప్రభుత్వ విభాగాలతో పాటు సరస్సు చుట్టూ నివసిస్తున్న వారి సహకారంతో బహుళ క్రమశిక్షణ కార్యకలాపాల అమలు వంటివి నిబంధనల్లో ఉన్నాయి.

# కీలక ప్రగతి సూచికల లక్ష్యాలు సాధించాలి

- స్వర్ణాంధ్ర విజన్ కేపీఐల సమీక్షలో కలెక్టర్ లక్ష్మీశ

**కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) :** స్వర్ణాంధ్ర విజన్-2047కు సంబంధించిన కీలక ప్రగతి సూచికల లక్ష్యాలను అన్నిశాఖలు పూర్తిస్థాయిలో సాధించాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో స్వర్ణాంధ్ర విజన్-కేపీఐల లక్ష్యాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కొన్నిశాఖలు బి, సీ గ్రేడుల్లో వున్నాయని, ఇవి తప్పనిసరిగా ఏ గ్రేడ్‌లోకి రావాలని ఆదేశించారు. వీఎంసీ, పోలీస్, ఆరోగ్య, విద్యా, సహకార శాఖలు మరింత పురోగతి సాధించాల్సి వుందన్నారు. సాధించిన ప్రగతి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా, ముఖ్య ప్రణాళిక అధికారి వై.శ్రీలత, వివిధ శాఖల జిల్లా అధికారులు, జిల్లా, నియోజకవర్గాల దార్శనిక ప్రణాళిక యూనిట్ల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

| | |
|---|---|
| బ్రాయిలర్‌బర్డ్ | 130, 139, 150 |
| చికెన్ విత్ స్కిన్ | 250 |
| చికెన్ స్కిన్‌లెస్ | 260 |



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 575

## మొక్కలు నాటి పరిరక్షించాలి



కంకిపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాలని టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవర్ణలో సిద్ధార్థ న్యాయ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ రోహిణి కుమారితో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ శేషగిరిరావు, దుర్గాదేవి, డైరెక్టర్ చలవాది రాజా, రవి కిషోర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం. పాండురంగారావు, యర్రపోతు రామకృష్ణ, కూటమి నాయకులు బోయిన నాగరాజు పాల్గొన్నారు.



ఎల్‌వోసీ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

## సీఎం సహాయనిధి పేదలకు వరం

ప్రసాదంపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పేదల పాలిట వరంగా మారిందని, కార్పొరేట్ వైద్యం పేదలకు అందుబాటులోకి తీసుకొచ్చి వారి ప్రాణాలను కాపాడుతోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అనారు. మంగళవారం విజయవాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రూ.6.50 లక్షల విలువైన ఎల్‌వోసీ పత్రాలను అందజేశారు. చేవెళ్ల వెంకటరమణ కుమారుని వైద్య చికిత్సకు రూ.3.5 లక్షలు, బాపులపాడు మండలం వీరవల్లి గ్రామానికి చెందిన వెలగపల్లి స్వరూపకు రూ.50 వేలు, ఉంగుటూరుకు చెందిన దేవరకొండ లక్ష్మికి రూ. 2.50లక్షలు విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్‌వోసీ లను రోగి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొల్లా ఆనంద్ కుమార్, నభిగాని కొండ, అద్దేపల్లి సాంబు, కొంగన రవి తదితరులు పాల్గొన్నారు.

## మాక్ అసెంబ్లీ మాకోసం అక్షయ ఎంపిక

ఉయ్యూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 26న రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మాక్ అసెంబ్లీ మాకోసం కార్యక్రమానికి ఉయ్యూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఉప్పల అక్షయ నియోజకవర్గ నుంచి ఎంపికైంది. మాకోసం కార్యక్రమంలో పాల్గొనేందుకు ఒక నియోజకవర్గం నుంచి ఒక్కొక్క విద్యార్థిని ఎంపిక చేసి అసెంబ్లీకి పంపనున్న నేపథ్యంలో పెనమలూరు జడ్పీ పాఠశాలలో జరిగిన పోటీల్లో అక్షయ ప్రథమ స్థానం సాధించి ఎంపికైంది. ఈ సందర్భంగా హెచ్ఎం నాగేశ్వరరావు మాట్లాడుతూ, మా కోసం కార్యక్రమంలో నియోజకవర్గం నుంచి అక్షయ ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు.



### ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

**GOLD FINANCE**

» బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర : 88024 89999
AJB-259765

**DISTANCE EDUCATION**

» శ్రీనివాస డిస్టెన్స్ ఎడ్యుకేషన్: 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్శిటీ ద్వారా BA, B.Com, B.Sc., M.Com, MBA, MCA. ✆ 99493 08940
AJB-235785

**PLOT FOR SALE**

» Sale. 323 Sq.Yards Residential Plot Patamata Vijayawada. Contact: ✆ 98490 02025, 93460 02025.
AJB-259759

» విజయవాడ గొల్లపూడి, కంచికచర్ల, పరిటాల ఇబ్రహీంపట్నం, గన్నవరం పరిసర ప్రాంతాల్లో ప్లాట్లు అమ్మదలచిన, కొనదలచిన వారు సంప్రదించండి. : 93947 17262
AJB-259757

**TO-LET**

» సెంటిని హస్పిటల్ ప్రక్కన G+5 కమర్షియల్ బిల్డింగ్‌లో 2 ఫ్లోర్‌లు (ప్రతి ఫ్లోర్ 2000 SFT) ఆఫీసులకు అద్దెకు కలవు. సెల్: 90002 76529
AJB-235935

**WANTED**

» బ్యాంక్ అనుబంధ సంస్థలో పని చేయుటకు రిటైర్డ్ అయిన వారు VRS తీసుకొన్న వారు టీచర్స్ మరియు గృహిణులు కావలెను. అర్హత : SSC to PG. Age : 30 above. వివరాలకు సంప్రదించండి. 99660 13779
AJB-235784

**పాఠకులకు ముఖ్య గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి



# అందరి సహకారంతో అభివృద్ధి

**ఏపీఐఐసీ హెడ్‌ఆఫీస్ సీజీఎం రామ్**



ఇండస్ట్రియల్ పార్టనర్‌షిప్ డ్రైవ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రామ్, దుర్గాప్రసాద్, ఖాలిక్, రమేష్ తదితరులు

ఆటోనగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అందరి పారిశ్రామికుల సహకారంతో జవహర్ ఆటోనగర్, కానూరు న్యూ ఆటోనగర్‌ను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని ఏపీ ఐఐసీ హెడ్‌ఆఫీస్ చీఫ్ జనరల్ మేనేజర్ ఐఎల్ రామ్ అన్నారు. న్యూఆటోనగర్‌లోని ఆటోక్లస్టర్ కార్యాలయంలో మంగళవారం ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్టనర్‌షిప్ డ్రైవ్ అవగాహన సమావేశం జరిగింది. ఈ కార్య క్రమానికి న్యూఆటోనగర్ ఐలా కమిషనర్ సీతామహాలక్ష్మి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన సీజీ ఎం రామ్ మాట్లాడుతూ, ఇండస్ట్రియల్ ప్రాంతాల్లో మౌలిక సదుపాయల కల్పనకు కృషి చేస్తామని చెప్పారు.ఐలా సర్వీస్ సొసైటీల పాలకవర్గాలకు ఎన్నికలు నిర్వహించాలని పారిశ్రామికులు కోరగా అందుకు సీజీఎం సానుకూలంగా స్పందించారు.

### సమస్యలు పరిష్కరించాలి

**ఐలా మాజీ చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్**

జవహర్ ఆటోనగర్‌లోని ఐలాకు పాలకవర్గం లేకపోవడంతో ఎక్కడ సమస్యలు అక్కడే తాండవిస్తున్నాయని ఐలా మాజీ చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్ సీజీఎం దృష్టికి తీసుకువెళ్లారు. డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపడాలని, రోడ్లు పరిస్థితి అస్తవ్యస్తంగా ఉందని, చెత్తను గ్రేడింగ్ చేసే యార్డు వల్ల అనారోగ్య పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆరోపించారు. ఏపీఐఐసీ జడ్ఎం పనివత్తిడి కారణంగా ఐలా కమిషనర్ బాధ్యతలు పూర్తిగా నిర్వర్తించలేకపోతున్నారని తెలిపారు. కానూరు న్యూఆటోనగర్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ ఖాలిక్ మాట్లాడుతూ, న్యూ ఆటోనగర్ ఏర్పడి రెండున్నర దశాబ్దాలు అయినా మౌలిక వసతులు లేవని, సరైన రోడ్లు, డ్రెయినేజీ లేక ఇబ్బంది పడుతున్నామని, వీధిలైట్లు వెలగడం లేదని తెలిపారు. జమాక్ హౌసింగ్ కాంప్లెక్స్ అధ్యక్షుడు త్రిపురనేని చందు మాట్లాడుతూ, జవహర్ ఆటోనగర్‌లో రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు చేసినా తాగునీరు అందడంలేదని, దీనిపై దృష్టిసారించాలని సీజీఎంను కోరారు. కార్యక్రమంలో న్యూ ఆటోనగర్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ కోశాధికారి పి. రమేష్, కుమర్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఇండస్ట్రియల్ పార్టనర్‌షిప్ డ్రైవ్ పోస్టర్‌ను రామ్, దుర్గాప్రసాద్, ఖాలిక్, రమేష్ ఆవిష్కరించారు.

## విజయశంఖారావాన్ని జయప్రదం చేయాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : భారతీయ సనాతన సంస్కృతి వైశిష్ట్యాన్ని యువతకు తెలియజేసేందుకు శివశక్తి ఫౌండేషన్ కృషి చేస్తున్నదని ధర్మప్రచారక్ యడవల్లి పాండురంగారావు తెలిపారు. కానుమోలులో శివశక్తి కార్యక్రమాల గురించి వివరిస్తూ దశవార్షిక మహోత్సవాల ఆహ్వానపత్రికను మంగళవారం అందజేశారు. దేవాలయాలే శక్తి కేంద్రాలుగా సామూహిక హారతి, నగరసంకీర్తన లాంటి దైవిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విజయవాడలో డిసెంబరు 14వ తేదీన నిర్వహించే శివశక్తి దశవార్షిక విజయశంఖారావ బహిరంగసభను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు తట్టి సుబ్బారావు, దుర్గ, శ్రీదేవి, వెంకటేశ్వరమ్మ, నాగదుర్గ తదితరులు పాల్గొన్నారు.



## ఆర్డీసీ డైరెక్టర్ శివశంకర్ చొరవతో గుంత పూడ్చివేత



శివశంకర్ పర్యవేక్షణలో కూడలిలో ఏర్పడ్డ గుంతతో పాటు నూజివీడు రోడ్డులో పలు చోట్ల ఏర్పడ్డ చిన్న చిన్న గుంతలను కూడా పూడ్చి మార్గాన్ని సుగమమం చేశారు.

హనుమాన్‌జంక్షన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జంక్షన్ నాలుగు రోడ్ల కూడలిలో నూజివీడు-విజయవాడ రోడ్డు మూలలో ప్రమాదకరంగా ఏర్పడిన గుంతను ఆర్డీసీ డైరెక్టర్ గరికపాటి శివశంకర్ చొరవతో మంగళ వారం పూడ్చించారు. గత కొద్ది రోజులు కిందట ఏర్పడ్డ గుంత క్రమేణా పెద్దదిగా మారి వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఆదమరిచి ప్రయాణిస్తే ప్రమాదాలకు గురయ్యేందుకు అవకాశం ఉండడంతో శివ శంకర్ చొరవ తీసుకొని ఆర్అండ్‌బీ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీంతో అధికారులు స్పందించి తారు, కంకర మిక్సర్ మెటీరియల్‌తో గుంతను పూడ్చించారు.

## దళితులపై దాడి అమానుషం



నిరసన తెలుపుతున్న కేవీపీఎస్ నాయకులు

గన్నవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దళితులపై దాడి అమానుషమని కేవీపీఎస్ నాయకులు అన్నారు. ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం బండ్లమూడిలో దళితులపై అగ్రవర్ణాల వారు చేసిన దాడికి నిరసనగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్. అనిల్ మాట్లాడుతూ, దళితుల పంట భూమిలో పెత్తందారుల గొర్రెలు పడి పంటను నాశనం చేశాయన్నారు. దీన్ని దళితులు ప్రశ్నించ డంతో అగ్రవర్ణాల వారు కర్రలు, కత్తులతో విచక్షణారహితంగా పోలీసుల ఎదుటే దాడి చేసి గాయపరచటం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, మిరప నాగేశ్వరావు, కళ్ళం రాంబాబు, రైతు సంఘం నాయకులు సూరగాని సాంబశివరావు, క్రైలే ఏసుదాసు, సీఐటీయూ నాయకులు కళ్లం వెంకటేశ్వరరావు, బెజవాడ తాతబ్బాయి తదితరులు పాల్గొన్నారు.



## అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

గన్నవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దావాజీగూడెం వైన్‌షాప్ సమీపంలో మహిళా అనుమానాస్పదంగా మృతి చెంది ఉంది. ఎస్సై శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన నక్కా వెంకటేశ్వరమ్మ(48) గన్నవరం పెట్రోల్ బంక్‌లకు ఎదురుగా ఉన్న హోటల్‌లో పని చేసేది. ఆమెకు ఇద్దరు కుమారులు. భర్త చనిపోయాడు. ఒంటరిగా ఉంటుంది. కొడుకులు ఒకరు వీఎస్‌పురం కాలనీ, మరొకరు కలిదిండిలో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఆమె శ్రీను అనే వెల్డర్‌తో పరిచయం పెంచుకుంది. వాళ్లిద్దరు కలసి ఉండేవాళ్లని అయితే ఆమె మృతికి కారణాలు తెలియలేదని ఎస్సై తెలిపారు.

## కరాటేలో ఉయ్యూరు విద్యార్థుల విజయం

ఉయ్యూరు, నంబరు 4 (ఆంధ్రజ్యోతి): జేకే గోజోరియో అకాడమీ గుంటుపల్లిలో రైల్వే ఇనిస్టిట్యూ ట్ వేగస్ వర్క్‌షాప్ కాలనీలో ఇటీవల నిర్వహించిన 24వ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో ఉయ్యూరుకు చెందిన నివాస్ కరాటే అండ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు విజయం సాధించా రు. జి.సాత్విక్, ఎ. అనన్య, జి.గీతిక, జి.సామిన్, ఎ.భవ్య, ఎం.మనుదీప్, వైరమ శ్రీదేవి, కె.వరసిద్ధిక, బి.నిఖిల్ ప్రథమ స్థానం సాధించారు. కె. పవన్ ద్వితీయ, ఎం.మ హస్విమ్ తృతీయ స్థానం సాధించారు. విజయం సాధించిన విద్యార్థులను కోచ్ డి.శ్రీనివాస్ అభినందించారు.



## విద్యార్థులు ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలి

హనుమాన్‌జంక్షన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక దశ నుంచి ప్రశ్నించే తత్వం అలవాటు చేసుకోవాలని స్థానిక శ్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచనేని సత్యప్రసాద్ విద్యార్థులకు సూచించారు. జనవిజ్ఞాన వేదిక బాపులపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం బాపులపాడు జడ్పీహైస్కూల్‌లో మండల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించి జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థులను ఎంపిక చేశారు. బాపులపాడు హైస్కూల్ హెచ్ఎం ఎం. శ్రీనివాసరావు, జేవీవీ నాయకులుభాస్కర్, శ్రీనివాస్, కె.నారాయణరావు, డి.మల్లేశ్వరరావు, సురేష్, సత్యనారాయణ, వినయ్, గణేష్ పాల్గొన్నారు.

గన్నవరం : విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవరుచుకోవాలని ప్రిన్సిపాల్ కొమ్మినేని రామకృష్ణ అన్నారు. స్థానిక స్రవంతి హైస్కూల్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గన్నవరం, ఉంగుటూరు మండలాల స్థాయిలో చెకుముఖి సైన్స్ సంబరాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ సైన్స్ పట్ల అభిరుచిని పెంచుకోవటమే కాకుండా, రుజువు చేయబడిన విషయాలను మాత్రమే మనస్తత్వాన్ని అలవరుచుకోవాలన్నారు. చెకుముఖి సైన్స్ జిల్లా కన్వీనర్ షేక్ ఇమాం మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి సైన్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు.



## గండిగుంట వద్ద జనానికి జగన్ అభివాదం



జగన్ పర్యటన కాన్వాయ్‌లో మూడు వాహనాలు ఒకదాని కొకటి ఢీకొని ధ్వంసమయ్యాయి. వేగంగా నడుపుతూ బ్రేక్ వేయడం వల్ల వాహనాలు ఢీకొన్నట్టు తెలియ వచ్చింది. ఉయ్యూరు పరిధిలో జియో పెట్రోల్ బంకు సమీపంలో కాన్వాయ్‌లో వాహనం ఢీకొని పోలీస్ వాహనం వెనుక బంపర్ విరిగిపోయింది. ఢీకొట్టిన వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఉయ్యూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జగన్ పర్యటన సందర్భంగా విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిపై గండిగుంట వద్ద వాహనాలు నిలిచి ట్రాఫిక్ జామ్ అయ్యింది. జగన్ జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం పెనమలూరు వైపు నుంచి గండిగుంట ఉయ్యూరు మీదుగా పామర్రు వైపు సాగింది. ముందుగా ప్రకటించిన సమయం కంటే రెండు గంట లకు పైగా ఆలస్యంగా గండిగుంట వచ్చి సెంటర్‌లో కారునిలిపి ప్రజలకు అభివాదం చేసుకుంటూ ముందుకు కదిలారు.

### ఢీ కొన్న కాన్వాయ్‌లో వాహనాలు

విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిపై గండిగుంట పరిధి ఆనందపురం సమీపా

## ఘనంగా యెనిగళ్ల జన్మదినం



యెనిగళ్లకు జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న టీడీపీ నేతలు

ఉయ్యూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ మండలాధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు జన్మదిన వేడుక పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. చినఓగిరాలలోని ఆయన నివాసంలో నాయకులు, అభిమానుల మధ్య కుటుంబరావు కేక్ కట్ చేశారు. కోటేశ్వరరావు, రమేష్, రామయ్య తదితరులు కుటుంబరావుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

## ఎన్నారైల పెట్టుబడులు పెరగాలి

» వివిధ దేశాల్లోని ప్రవాసులతో క్లబ్ ఏర్పాటు: మంత్రి కొండపల్లి



అమరావతి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడుల్లో ఎన్నారైల భాగస్వామ్యం పెరగాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆకాంక్షించారు. మంగళవారం ఏపీ ఎన్నార్టీఎస్ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. వివిధ దేశాల్లో కీలక స్థానాల్లో ఉన్న ప్రవాసాంధ్రులతో ఓ క్లబ్ ఏర్పాటు చేసి.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలను వారికి వివరించాలని అధికారులను ఆదేశించారు.

## పార్ట్‌టైం టీచర్లను తొలగించం: మంత్రి డోలా



అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ద్వారా రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించడం వల్ల ఎస్సీ గురుకులాల్లోని పార్ట్‌టైం టీచర్లను తొలగిస్తామనే ఆందోళన అవసరం లేదని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి భరోసా ఇచ్చారు. ఖాళీ పోస్టుల్లో నియమించి వారందరి సేవలను వినియోగించుకుంటామని ఒక ప్రకటనలో తెలిపారు.

## చేతివృత్తిదారులకు శాశ్వత ఉపాధి: మంత్రి సవిత



అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోటీ ప్రపంచంలో కుల, చేతివృత్తిదారులు నిలదొక్కుకునేలా ఆధునిక పరికరాలు అందజేసి, వారికి శాశ్వత ఉపాధి కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. విజయవాడ శివారు గొల్లపూడిలోని బీసీ భవన్‌లో మంగళవారం ఏడు కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లతో సమావేశంలో ఆమె మాట్లాడారు.

## బ్రాహ్మణ కార్పొరేషన్‌కు డైరెక్టర్ల నియామకం

అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్‌కు పలువురు డైరెక్టర్లను నియమించారు. ఆర్థికంగా వెనుకబడిన సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి కె.సునీత ఈ ఉత్తర్వులు జారీచేశారు. ఆకెళ్ల వెంకటనారాయణ మూర్తి(అమలాపురం నియోజకవర్గం), ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్(నెల్లూరు), చెరుకుపల్లి సంతోష్(భీమవరం), చివుకుల దుర్గాప్రసాద్(బాపట్ల), దార్వాడ ఆనందరావు(కర్నూలు), జి.బాబూరావు(మంత్రాలయం), కృష్ణమోహన్ సబ్నివీసు(తాడేపల్లిగూడెం), కొలచన శ్రీపద్మ(నరసాపురం), నాయకో రంజిత్ కుమార్ (కురుపాం), సిందిగేరి కరణం శ్రీనివాసరావు(పాణ్యం), సరేపాక సురేశ్(చీపురుపల్లి), సూర్యప్రభ విశ్వనాథం(అనకాపల్లి), తేజోమూర్తుల నాగలక్ష్మి నరసింహమూర్తి(రాజమండ్రి సిటీ), వెలగలేటి వెంకట పూర్ణ గంగాధర్(గుంటూరు), పల్లవాజుల వెంకట ఫణికుమార్(మచిలీపట్నం)లను డైరెక్టర్లుగా నియమించారు.

## విద్యుత్ చార్జీల భారం తగ్గించాలి: ఏపీచాంబర్స్

అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పరిశ్రమలపై విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలని రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య(ఏపీ చాంబర్స్) డిమాండ్ చేసింది. మంగళవారం విజయవాడలోని ఓ హోటల్‌లో ఏపీ చాంబర్స్ బోర్డు మీటింగ్ నిర్వహించారు. అనేక అంశాలపై చర్చించారు. ఆ వివరాలను చాంబర్స్ అధ్యక్షుడు భాస్కరరావు విలేకరులకు వెల్లడించారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు చాలా అధికంగా ఉన్నాయని చెప్పారు. డిసెంబరు 12 నుంచి 14 వరకు విజయవాడలో నిర్వహించతలపెట్టిన 'బిజినెస్ ఎక్స్‌పో-2025' బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

## 'దేవదాయ' స్థపతి సలహాదారుడిగా సుందర్‌రాజన్

అమరావతి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దేవదాయ ధర్మాదాయ శాఖకు స్థపతి సలహాదారుడిగా ఎస్.సుందర్‌రాజన్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు దేవదాయ శాఖ ఎక్స్‌అఫిషియో సెక్రటరీ ఎం.హరిజవహర్‌లాల్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

# రోడ్ల నాణ్యతలో రాజీ వద్దు

### గుంతలు పడితే అధికారులదే బాధ్యత

» 'సాస్కి' నిధులు సద్వినియోగం చేసుకోండి

» పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ దిశానిర్దేశం



అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామీణ రహదారుల నిర్మాణంలో రాజీ పడవద్దని, నాణ్యంగా నిర్మించాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. నిర్మాణానంతరం.. ఆయా రహదారులపై గుంతలు పడితే దానికి అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. రాష్ట్రంలోని గ్రామీణ రహదారుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సాస్కి(రాష్ట్రాల మూలధన పెట్టుబడులకు ఇచ్చే ప్రత్యేక సహాయ నిధులు) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పథకం కింద రాష్ట్రానికి రూ.2 వేల కోట్ల నిధులు సమకూరాయని తెలిపారు. వీటితో రోడ్లను పునర్నిర్మించే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. తొలుత పూర్తిగా ధ్వంసమైన రహదారులను నిర్మించాలన్నారు. సాస్కి నిధులను వినియోగించే ప్రణాళికలపై అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. రహదారుల నాణ్యతలో రాజీపడవద్దని చెప్పారు. "కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో సమన్వయంతో ముందుకు సాగుతున్నాయి. ప్రత్యేక శ్రద్ధతో సాస్కి నిధులు తీసుకొచ్చాం. వాటి ఫలాలు ప్రజలకు అందించాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులతోపాటు అధికార యంత్రాంగం పైనా ఉంది. ప్రతి నియోజకవర్గంలో రోడ్లు మెరుగుపడేలా నిధులు సమకూరుస్తున్నాం. రహదారుల నిర్మాణంలో ప్రమాణాలు పాటిస్తున్నారో లేదో పరిశీలించాల్సిన బాధ్యత అధికారులదే. కాంట్రాక్టు పొందిన వారికి ముందుగానే నాణ్యతా ప్రమాణాల గురించి తెలియజేయాలి. ఆ ప్రమాణాల మేరకు రహదారులను నిర్మిస్తున్నదీ లేనిదీ ఎప్పటికప్పుడు తనిఖీ చేయడం అవసరం ఉంది. నిర్మాణం మొదలయ్యాక పలు దశల్లో నాణ్యత పరిశీలించాలి. నేను కూడా నిపుణులను తీసుకుని క్షేత్రస్థాయిలో రహదారుల నాణ్యతను తనిఖీ చేస్తా. ప్రమాణాలకు అనుగుణంగా లేకపోతే అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఏ మాత్రం అవకతవకలు జరిగినా ఉపేక్షించేది లేదు." అని తేల్చిచెప్పారు.

### గత ప్రభుత్వం విస్మరించింది

సాస్కి నిధులను ప్రత్యేక సందర్భాల్లో ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు కూడా వినియోగించుకోవచ్చని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. పుట్టపర్తిలో సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. దీనిలో భాగంగా పంచాయతీ రోడ్లను పటిష్ఠ పరచాలని తెలిపారు. దీనికిగాను రూ.35 కోట్లను సాస్కి నిధుల నుంచి వెచ్చించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. రోడ్ల నిర్మాణం విషయంలో గత ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంతో వ్యవహరించిందని విమర్శించారు. వివిధ మార్గాల్లో రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు వచ్చే వెసులుబాటు ఉన్నప్పటికీ విస్మరించిందన్నారు. నిధులు పొందడంలో, వాటిని వినియోగించే ప్రక్రియలో సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు తగిన సూచనలు అందిస్తున్నారని తెలిపారు.

## 'సీనరేజీ'పై సానుకూల నిర్ణయం!

» గ్రానైట్ పరిశ్రమ సమస్యల పరిష్కారానికి కమిటీ

» అసోసియేషన్ ప్రతినిధులకు మంత్రి కొల్లు హామీ

» సమ్మెతో కార్మికులకు ఇబ్బందులు.. విరమించాలని సూచన

అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రానైట్ ఇండస్ట్రీలో సమస్యల పరిష్కారానికి ఉమ్మడి కమిటీ ఏర్పాటు చేస్తామని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ప్రకటించారు. గ్రానైట్ ఇండస్ట్రీ, కటింగ్ యూనిట్ల అసోసియేషన్ల ప్రతినిధులు, గనుల శాఖ అధికారులు ఈ కమిటీలో ఉంటారని తెలిపారు. గ్రానైట్ పరిశ్రమ రంగంలో ఉన్న సమస్యలు, ప్రత్యేకించి ప్రస్తుతమున్న సీనరేజీ ఫీజులు, గనుల సంబంధిత ఇతర ఫీజులపై కమిటీ అధ్యయనం చేస్తుందని, ఆ తర్వాత ప్రభుత్వం తగిన సానుకూల పరిష్కారం చూపిస్తుందని పేర్కొన్నారు. ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల పరిధిలో అధిక సీనరేజీ వసూళ్లను నిరసిస్తూ పరిశ్రమదారులు, కటింగ్ యూనిట్ల నిర్వాహకులు కొద్దిరోజులుగా సమ్మె చేస్తోన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గ్రానైట్ పరిశ్రమల అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం సచివాలయంలో మంత్రిని కలిశారు. తమ నుంచి చాలా ఎక్కువ మొత్తంలో సీనరేజీ వసూలు చేస్తున్నారని అసోసియేషన్ ప్రతినిధులు వాపోయారు. 'మేం ప్రభుత్వానికి చట్టబద్ధమైన ఫీజులు, పన్నులు చెల్లిస్తాం. కానీ, సీనరేజీ కాంట్రాక్టు సంస్థ నుంచి మమల్ని కాపాడండి' అని కోరారు. ఒకసారి ప్రభుత్వానికి తగిన ఫీజులు చెల్లించాక, అదే పేరుతో ప్రైవేటు సంస్థకు ఎందుకు చెల్లించాలని ప్రశ్నించారు. రెండింతలుగా సీన రేజీ ఫీజులు వసూలు చేయడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో అన్ని అంశాలపై సమగ్ర పరిశీలన కోసం కమిటీ ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. వారం రోజుల్లోగా ఈ కమిటీ నివేదిక అందిస్తుందని, ఆ మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. సమ్మె వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతారని, తక్షణమే సమ్మె విరమించి పనులు ప్రారంభించాలని సూచించారు. సమస్యకు సత్వర పరిష్కారం చూపాలని ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు కొల్లు రవీంద్రను కోరారు. సీఎం లండన్ నుంచి వచ్చాక చర్చించి, ఒక కొలిక్కి తీసుకురావాలని మంత్రులు నిర్ణయించినట్లు తెలిసింది.

## గిరిజన పాఠశాలలకు 113 కోట్లు

» త్వరలో విశాఖలోనూ ఐఐటీ కోచింగ్ సెంటర్

» గిరిజనులకు 150 రోజుల ఉపాధి పనులు

» గిరిజన సంక్షేమ మంత్రి సంధ్యారాణి



అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని తొమ్మిది ఐటీడీఏల పరిధిలోగల 757 గిరిజన పాఠశాలల్లో(వీటిలో 199 గురుకులాలు) మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం రూ.113 కోట్లు మంజూరు చేసినట్లు గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఇందులో రూ.83 కోట్లను ఆశ్రమ పాఠశాలలకు, రూ.30 కోట్లు వసతి గృహాలకు కేటాయించామన్నారు. ఆర్వో ప్లాంట్లు, వాష్ రూమ్‌లు, ఇతర సదుపాయాలను కల్పించనున్నట్లు తెలిపారు. మంగళవారం అమరావతి సచివాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గిరిజన పాఠశాలల్లో వసతుల కల్పన కోసం గత ఏడాది రూ.155 కోట్లను వెచ్చించిందన్నారు. వసతి గృహాల్లో త్వరలో.. విద్యార్థులు వారి తల్లిదండ్రులతో మాట్లాడుకునేందుకు వీలుగా ప్రీపెయిడ్ ఫోన్లు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. 150 మంది మెరిటోరియస్ విద్యార్థులను గుర్తించి వారికి ఐఐటీ, ఎన్ఐటీ, నీట్ పోటీ పరీక్షల కోచింగ్‌ను పార్వతీపురం, సీతంపేటలలో ప్రారంభించామని, మరో కేంద్రాన్ని త్వరలోనే విశాఖపట్నంలో ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. గిరిజన పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేదని తెలిపారు. గిరిజనులకు ఉపాధిహామీ కింద 150 రోజులపాటు పనిదినాలను కల్పించనున్నట్లు చెప్పారు. శ్రీశైలం అటవీ ప్రాంత గిరిజనులకు.. పోడు వ్యవసాయం నిమిత్తం ఆర్ఓఎఫ్ఆర్ కింద త్వరలో భూపట్టాలు అందజేస్తామన్నారు. సికిల్‌సెల్ ఎనీమియాతో బాధపడే గిరిజన మహిళలకు ఐరన్, కాల్షియం మాత్రలను అందజేయడంతోపాటు వీరికి ప్రత్యేక చికిత్స అందజేసేందుకు విశాఖ కేజీహెచ్‌లో ఒక ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి పనులు ప్రాధాన్యత క్రమంలో చేసుకుంటూ వస్తున్నామని చెప్పారు. అంతేతప్ప గత ప్రభుత్వం లాగా తాము శిలాఫలకాలకే పరిమితం కాబోమని మంత్రి వ్యాఖ్యానించారు.

## శిక్షణ ఇంకెప్పుడు!

» కానిస్టేబుల్ పోస్టులకు 6,100 మంది ఎంపిక

» రెండు నెలల క్రితం మెడికల్ టెస్టులు పూర్తి

» ఇంతవరకు ప్రారంభం కాని శిక్షణ తరగతులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర పోలీస్ శాఖలో కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు శిక్షణ కోసం ఎదురుచూస్తున్నారు. నియామక ప్రక్రియ ప్రారంభమై నాలుగేళ్లు గడిచినా ఇప్పటికీ ఆయా పోస్టులకు మోక్షం కలగలేదు. దీంతో అభ్యర్థులు మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేసేందుకు 2022, నవంబరులో అప్పటి వైసీపీ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. సుమారు 6,100 పోస్టులను భర్తీ చేసేందుకు 2023 జనవరిలో ప్రిలిమ్స్ నిర్వహించారు. సుమారు 90 వేల మంది తదుపరి దశకు అర్హత సాధించారు. న్యాయపరమైన చిక్కులను కారణంగా చూపించి ఈ ప్రక్రియను వైసీపీ ప్రభుత్వం మధ్యలోనే వదిలేసింది. ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక కోర్టు కేసులను పరిష్కరించి, ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి మధ్య ఫిజికల్ పరీక్షలను నిర్వహించింది. వీటిలో అర్హత సాధించిన సుమారు 45 వేల మందికి ఈ ఏడాది జూన్‌లో మెయిన్స్ నిర్వహించారు. ఆగస్టు 1న ఫలితాలను వెలువరించారు. ఎంపికైన వారికి మెడికల్ టెస్టులు పూర్తిచేశారు. వీటిలోనూ అర్హత పొందిన వారిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఆ వెంటనే శిక్షణకు పిలుస్తారని అభ్యర్థులు భావించారు. కానీ, రెండు నెలలు గడిచినా శిక్షణ షెడ్యూల్ విడుదల చేయకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని అభ్యర్థులు కోరుతున్నారు.

## 8 ఆస్పత్రుల్లో ఎస్ఎన్‌సీయూలు

» 4.80 కోట్లతో పీపీపీ విధానంలో ఏర్పాటు

అమరావతి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రుల్లో అప్పుడే పుట్టిన చిన్నారుల కోసం అదనంగా మరో 8 ప్రత్యేక నవజాత శిశువుల సంరక్షణ విభాగాలు (ఎస్ఎన్‌సీయూ) ఏర్పాటు చేస్తున్నట్లు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం తెలిపారు. ఈ ఎనిమిది ఎస్ఎన్‌సీయూల ద్వారా అదనంగా 80 పడకలు అందుబాటులోకి రానున్నాయని ఆయన ప్రకటించారు. ఒక్కో ఎస్ఎన్‌సీయూ ఏర్పాటుకు రూ.60 లక్షల చొప్పున ఎనిమిది యూనిట్లకు మొత్తం రూ.4.80 కోట్లు ఖర్చవుతుందని వెల్లడించారు. పీపీపీ (పబ్లిక్ ప్రైవేటు పాట్నర్‌షిప్) విధానంలో ఈ 8 ఎస్ఎన్‌సీయూలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కోనసీమ జిల్లా అమలాపురం ఏరియా ఆస్పత్రి, చిత్తూరు జిల్లా కుప్పం ఏరియా ఆస్పత్రి, అనంతపురం జిల్లా గుంతకల్ ఏరియా ఆస్పత్రి, కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు సీహెచ్‌సీల్లో ఈ నెలాఖరులోగా ఎస్ఎన్‌సీయూల సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఏలూరు జిల్లా నూజివీడు ఏరియా ఆస్పత్రి, నెల్లూరు జిల్లా కావలి ఏరియా ఆస్పత్రి, సత్యసాయి జిల్లా కదిరి ఏరియా ఆస్పత్రి, తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో త్వరలోనే అందుబాటులోకి వస్తాయని వివరించారు. రాష్ట్రంలో టీచింగ్, జిల్లా, ఏరియా ఆస్పత్రులు, సీహెచ్‌సీల్లో ఇప్పటికే 62 ఎస్ఎన్‌సీయూలు పనిచేస్తున్నాయని, వీటిలో 28 ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్నాయని తెలిపారు. తక్కువ బరువుతో పుట్టిన శిశువులు, పచ్చకామెర్లు, హైపోథెర్మియా, శ్వాసకోస, సెప్సిస్ వంటి సమస్యలతో బాధపడే చిన్నారులకు ఎస్ఎన్‌సీయూల్లో చికిత్స అందిస్తారన్నారు.

## నేడు దుర్గగుడిలో గిరిప్రదక్షిణ, కోటి దీపోత్సవం, జ్వాలాతోరణం

ఇంద్రకీలాద్రి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో నేడు బుధవారం కార్తీకపౌర్ణమి సందర్భంగా గిరిప్రదక్షిణ, కోటిదీపోత్సవం, జ్వాలాతోరణం నిర్వహిస్తున్నారు. సాధారణంగా ప్రతిమాసంలోనూ పౌర్ణమినాడు నిర్వహించే గిరిప్రదక్షిణ యథావిధిగా ఉదయం 5.55 గంటలకు టోల్‌గేట్ దగ్గర నుంచి ప్రారంభమవుతుంది. కార్తీకమాసం పౌర్ణమి సందర్భంగా ఆలయంలో సాయంత్రం 5.30 గంటలకు కోటి దీపోత్సవం నిర్వహిస్తారు. అదే సమయంలో మల్లేశ్వరాలయం వద్ద జ్వాలా తోరణాన్ని నిర్వహిస్తారు. కోటి దీపోత్సవంలో ఆలయం, ఆలయ ప్రాంగణం, పరిసరాల్లో దీపాలను వెలిగిస్తారు. 500 మంది సేవాదళ్ సభ్యులు దీపోత్సవంలో పాల్గొని సహకరిస్తారు. అనంతరం 2,500 మందికి అన్నసంతర్పణ నిర్వహిస్తారు. మూడు విశిష్ట ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని తరించాలని ట్రస్ట్‌బోర్డు చైర్మన్, ఈవో వీకే శీనానాయక్ మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు.

## హైదరాబాద్‌కు వెళ్లాల్సిన విమానం గన్నవరంలో ల్యాండింగ్

గన్నవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): హుబ్లీ నుంచి హైదరాబాద్ వెళ్లవలసిన ఇండిగో విమానం గన్నవరం విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండింగ్ అయ్యింది. 77 మంది ప్రయాణికులతో హుబ్లీ నుంచి హైదరాబాద్ బయలుదేరిన విమానం అక్కడ వాతావరణం అనుకూలించకపోవటంతో కొద్దిసేపు చక్కర్లు కొట్టి గన్నవరం విమానాశ్రయంలో ల్యాండింగ్ అయింది. సుమారు గంట తరువాత హైదరాబాద్‌లో వాతావరణం అనుకూలంగా ఉండటంతో తిరిగి వెళ్ళింది. ప్రయాణికులు కొద్దిసేపు గందరగోళానికి గురయ్యారు.

## స్మృతివనాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి

● ఇండియన్ అంబేడ్కర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు

విజయవాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అంబేడ్కర్ స్మృతివనాన్ని సుందరంగా తీర్చిదిద్ది పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని ఇండియన్ అంబేడ్కర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. నగరంలోని మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ, అన్ని వసతులు కల్పించడానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. పారిశుధ్య నిర్వహణ సరిగాలేదని అనేక దళిత సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయని, ప్రభుత్వం స్పందించి పర్యాటకంగా అభివృద్ధి చేయాలని పర్యాటక శాఖకు అప్పగించడం అభినందనీయమన్నారు. స్మృతివనంలో ఫుడ్‌కోర్టు, పిల్లల ఆటస్థలం, కన్వెన్షన్ సెంటర్ పూర్తిచేసి రోజూ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. కలెక్టర్ లక్ష్మీశ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అధికారులతో సమావేశం నిర్వహించడాన్ని స్వాగతించారు. పలువురు అంబేడ్కర్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

## మచిలీపట్నం బులియన్ జ్యూయలరీ, డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కిషోర్



మచిలీపట్నం టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం బులియన్, జ్యూయలరీ అండ్ డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉడత్తు కిషోర్ ఎన్నికయ్యారు. గోల్డ్ కన్వెన్షన్ హాలులో మంగళవారం జరిగిన ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. అధ్యక్షుడిగా ఉడత్తు కిషోర్, ప్రధాన కార్యదర్శిగా ఉదయగిరి మురళి, కోశాధికారిగా టీవీ ప్రసాదరావు ఎన్నికయ్యారు. టీడీపీ నేతలు కొనకళ్ల జగన్నాథరావు, మునిసిపల్ మాజీచైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ పాల్గొన్నారు.

# బూడిద లోడింగ్‌కు ట్రాన్స్‌పోర్టర్ల అడ్డగింత

ఉచిత లోడింగ్ హామీకి సాయంత్రం వరకు పట్టు ● నిలిచిన టిప్పర్లు ● రెండ్రోజుల గడువు కోరిన రిపెక్స్ ప్రతినిధులు



నిరసన తెలుపుతున్న స్థానిక ట్రాన్స్‌పోర్టర్స్‌కు మద్దతుగా నిలిచిన కూటమి నేతలు

ఇబ్రహీంపట్నం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బూడిద చెరువు నుంచి తమకు ఉచితంగా బూడిద లోడింగ్ చేస్తామని చెప్పి టిప్పర్‌కు మెంటినెన్స్ నిమిత్తం అంటూ రూ.800 కడితేనే బూడిద లోడింగ్ చేస్తామని బూడిద కాంట్రాక్టు సంస్థ రిపెక్స్ మెలికపెట్టడంతో స్థానిక ట్రాన్స్‌పోర్టర్స్ మంగళవారం బూడిద చెరువులో లోడింగ్‌ను అడ్డుకున్నారు. దీంతో వందలాది టిప్పర్లు నిలిచిపోయాయి. బూడిద చెరువు వద్ద నిరసన తెలుపుతున్న స్థానిక ట్రాన్స్‌పోర్టర్స్‌కు కూటమి నేతలు చెన్నుబోయిన చిట్టిబాబు, రావి మణిరాజ్ (పణి), షైలా సైదులు, చుట్టుకుదురు శ్రీనివాసరావు, చనమోలు నారాయణ, గరికపాటి శ్రీనివాసరావు, గరికపాటి శివ సంఘీభావం తెలిపి కాంట్రాక్టు సంస్థ రిపెక్స్ ప్రతినిధులతో చర్చలు జరిపారు. 60 రోజులు ఉద్యమం ముగింపు సందర్భంగా కాంట్రాక్టు సంస్థ ఇచ్చిన మాట తప్పి డబ్బులకు బూడిద ఇస్తామనడం విడ్డూరంగా ఉందని ఎట్టి పరిస్థితుల్లో స్థానిక ట్రాన్స్‌పోర్టర్స్‌కు ఉచితంగా బూడిద లోడింగ్ చేయాల్సిందేనని నేతలు పట్టుబట్టారు. ఈక్రమంలో కొద్దిసేపు కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులకు, స్థానిక ట్రాన్స్‌పోర్టర్స్‌కు వాగ్వాదం చోటు చేసుకుంది. రెండ్రోజులు సమయం ఇస్తే సంస్థ పెద్దల దృష్టిలో పెట్టి నిర్ణయం చెబుతామని రిపెక్స్ ప్రతినిధులు చెప్పడంతో స్థానిక ట్రాన్స్‌పోర్టర్స్ నిరసన విరమించారు. ఉచిత బూడిద లోడింగ్ చేసేవరకు బూడిద చెరువులో నుంచి ఒక్క టిప్పర్ బూడిద కూడా బయటకు వెళ్లనీయమని స్థానిక ట్రాన్స్‌పోర్టర్స్ స్పష్టం చేశారు.

### ఈఈని ట్రాన్స్‌పోర్టర్స్ నిలదీత

డాక్టర్ ఎన్టీటీపీఎస్ తరపున కాంట్రాక్టు సంస్థకు స్థానిక ట్రాన్స్‌పోర్టర్స్‌కు మధ్య సఖ్యత కుదిర్చేందుకు బూడిద చెరువు వద్దకు వచ్చిన డాక్టర్ ఎన్టీటీపీఎస్ అధికారులకు చేదు అనుభవం ఎదురైంది. మంచి నీటి కుళాయిల ద్వారా బూడిద కలిసిన నీటిని ఒక బాటిల్‌లో తెచ్చి ఈ నీరు మీరు తాగండని స్థానిక ట్రాన్స్‌పోర్టర్స్ ఈఈని నిలదీశారు. మా ముఖాన బూడిద కొట్టి తాగునీరు కాలుష్యం చేస్తూ, వాయు కాలుష్యం వెదజల్లుతూ మా జీవితాలను నాశనం చేస్తున్నారని మండిపడ్డారు.



నూతనంగా ఎన్నికైన ప్రైవేట్ టూరిస్టు బస్సు ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గం

## టూరిస్టు బస్సులకు గ్రీన్‌ట్యాక్స్ మినహాయించాలి

● ఏపీ ప్రైవేట్ టూరిస్టు బస్సు ఓనర్స్ అసోసియేషన్

గవర్నర్‌పేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పరిధిలో తిరిగే ప్రైవేట్ టూరిస్టు బస్సులకు గ్రీన్‌టాక్స్ మినహాయింపు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ టూరిస్టు బస్సు ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. మంగళవారం ఎంజీ రోడ్డులోని ఎంబీవీకేలో అసోసియేషన్ రాష్ట్ర సమావేశం జరిగింది. సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడు బొబ్బ అనేష్‌బాబు మాట్లాడుతూ ఈశాన్య రాష్ట్రాల్లో పర్మిట్‌లు తీసుకుని ఆంధ్ర రాష్ట్రంలో బస్సులు నడిపే వారితో టూరిస్టు బస్సు ఆపరేటర్లు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో పర్మిట్లు తీసుకుని రూపాయి టాక్స్ కట్టకుండా స్టేజీ క్యారేజ్ నిర్వహిస్తూ ప్రైవేట్ టూరిస్టు బస్సు ఆపరేటర్లకు తీవ్రనష్టం కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసోసియేషన్ ప్రతినిధులు అశ్విన్‌రెడ్డి, సత్యప్రసాద్, వేములపల్లి వెంకటేశ్వర్లు, కేతనసాయి, చిరంజీవి, రణదీప్, రామినేని కృష్ణ పాల్గొన్నారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక

అధ్యక్షుడిగా బొబ్బ అనేష్‌బాబు (విజయవాడ), గౌరవాధ్యక్షుడిగా సంజీవరెడ్డి (గుంటూరు), కార్యదర్శిగా కే శివరాం ప్రసాద్ (కాకినాడ), ఉపాధ్యక్షులుగా ఎం మురళీమోహన్ (కాకినాడ), కొల్లి కృష్ణచౌదరి (విశాఖపట్నం), కోశాధికారిగా కొట్టే శ్రీనివాసరావు (విజయవాడ) ఎన్నికయ్యారు.

## విద్యుత్ సమస్యలను పరిష్కరించండి

విద్యుత్‌శాఖ సీఎండీ పుల్లారెడ్డికి ఎమ్మెల్యే మండలి వినతి

అవనిగడ్డ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా ఉన్న ప్రధాన విద్యుత్ సమస్యలను పరిష్కరించాల్సిందిగా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ విద్యుత్ శాఖ సీఎండీ పుల్లారెడ్డికి విజ్ఞప్తి చేశారు. అవనిగడ్డ సబ్ సెంటర్‌కు వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని సీఎండీ పుల్లారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలు వివరించారు. ఈలచెట్లదిబ్బ, నాచుగుంట నుంచి 11 కెవి విద్యుత్ లైన్ వేయాలని, అవనిగడ్డ - మోపిదేవి మధ్య ప్రత్యేక బ్రేకర్, ఏటిమొగ - గణపేశ్వరం మధ్య 33 కెవి ఇంటర్ లింకింగ్ లైన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కోరారు. విద్యుత్ శాఖ అధికారులు ప్రతిపాదనలు అందజేశారు. మొంథా తుఫాన్ సమయంలో విద్యుత్ సిబ్బంది చేసిన కృషిని మండలి బుద్ధప్రసాద్ సీఎండీ దృష్టికి తీసుకెళ్లి అభినందించారు. టెక్నికల్ డైరెక్టర్ ఆవుల మురళీకృష్ణ యాదవ్, సూపరింటెండెంట్ ఇంజనీర్ మర్లపూడి సత్యానందం, ఈఈ బి.వి.సుధాకర్, టెక్నికల్ డిఈ విజయభాస్కర్, విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యుత్ శాఖ సీఎండీ పుల్లారెడ్డికి సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

## సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ



మోపిదేవి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరిజవహర్‌లాల్ కుటుంబసమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. అర్చక బృందం వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికారు. ఈవో దాసరి శ్రీరామ వరప్రసాద్ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.



మహిళా చట్టాలపై అవగాహన సదస్సులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపి

## మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలి

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపి

బంటుమిల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై అవగాహన ఉంటే ఎలాంటి ఇబ్బందులనైనా ధైర్యంగా ఎదుర్కోవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపి అన్నారు. బంటుమిల్లి కోర్టు ఆవరణలో మంగళవారం మహిళా చట్టాలు అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్య, వివాహంతో పాటూ ఆర్థిక స్థిరత్వం కూడా అవసరం అన్నారు. మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం రూ.7.5 లక్షల వ్యయంతో నిర్మించిన ఆర్వో ప్లాంటును ప్రారంభించారు. జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి రామకృష్ణ, బంటుమిల్లి ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.భాస్కరరావు, బార్ అసోసియేషన్ సభ్యులు యాళ్ల శ్యామ్‌బాబు, తహసీల్దార్ పూర్ణచంద్రరావు, ఎంపీడీవో నీరాజాక్షి, సీడీపీవో సముద్రవేణి పాల్గొన్నారు.

## మాజీ సైనికుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

● మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాండ్ర

గాంధీనగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మాజీ సైనికుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.10కోట్ల నిధులను ప్రకటించి ఏడాదిన్నర కావస్తున్నా నేటికీ కార్యరూపం దాల్చకపోవడం శోచనీయమని రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్పొరేషన్ సభ్యులుగా ఎలాంటి నేరచరిత్రలేని మాజీ సైనికులకు చోటు కల్పించాలన్నారు. హారిజాంటల్ రిజర్వేషన్ పద్ధతిని తొలగించి సాధారణ పద్ధతిలో మాజీ సైనికులకు రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వ రంగాల్లో అవకాశాలు కల్పించేలా 2 నుంచి 10 శాతానికి రిజర్వేషన్లు పెంచాలని కోరారు. రాష్ట్రంలో విపత్కర పరిస్థితులు సంభవించినప్పుడు పోలీసులకు సహకరించేందుకు ఆ శాఖలో మాజీ సైనికులకు ఎక్కువ అవకాశాలు కల్పించాలన్నారు. ప్రధానకార్యదర్శి సూరెడ్డి శివకుమార్, గౌరవాధ్యక్షుడు అన్నే రామారావు, కోశాధికారి కే ఉమామహేశ్వరరావు, గౌరవ సలహాదారు సుంకర శేషగిరి, షేక్ మొయినుద్దీన్, డి వెంకటేశ్వర్లు, తాడివాక రుక్మదరరావు పాల్గొన్నారు.

**బ్రాయిలర్ ధరలు**

అమరావతి (రూ.లలో)

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 130, 139, 150 |
| చికెన్ విత్ స్కిన్ | 250 |
| చికెన్ స్కిన్‌లెస్ | 260 |

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 575

## వైభవంగా వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు

గుడివాడ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : స్థానిక జగన్నాధపురంలో వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం యాగశాలలో పవిత్రా రోహణ, హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. ఉత్సవ మూర్తులను, దేవస్థాన గోపురాలను పవిత్ర మాలలతో అలంకరించారు. బుధవారం 108 కలశాలతో స్వామి, అమ్మవార్లకు పంచామృతా అభిషేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో వేణుగోపాలరావు తెలిపారు. దేవస్థాన ఉత్సవ కమిటీ చైర్మన్ లింగం చిట్టిబాబు, సభ్యులు కృష్ణారావు, శ్రీనివాసరావు, కృష్ణవేణి, విజయలక్ష్మి, సుజాత, జోగి సాంబశివరావు, భక్తులు పాల్గొన్నారు.



పవిత్ర మాలలను ఊరగింపుగా తీసుకువస్తున్న వేద పండితులు



అధికారులతో మాట్లాడుతున్న ఫర్హీన్ జాహిద్, యుగంధర్

## పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీలు

గుడ్లవల్లేరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి యుగంధర్‌లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించారు. ఓపీ సేవలు ఎలా అందుతున్నాయన్నది అక్కడ ఉన్న పేషంట్లను అడిగి తెలుసుకొన్నారు. లేబర్ రూమ్ వార్డును, పరీక్షల లాబొరేటరీ, ఫార్మశీలను తనిఖీలు చేశారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ప్రేమ్ చంద్, వైద్యాధికారులు యశశ్వినీ, ప్రవీణ పాల్గొన్నారు.



స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో విష్ణు ప్రసాద్

## పన్ను బకాయిలపై అవగాహన అవసరం

గుడివాడ రూరల్ : గ్రామాల్లోని పంచాయతీలు ట్యాక్స్, నాన్ ట్యాక్స్‌బుల్ బకాయిల వివరాలు కార్యదర్శులు తెలుసుకోవాలని ఎంపీడీవో విష్ణు ప్రసాద్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్, క్యూఆర్ కోడ్ సిస్టమ్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్యాక్సులు ఏ విధంగా వేస్తారో వివరంగా తెలియజేయాలన్నారు. గ్రామంలో క్యూఆర్ కోడ్ వివరాలను అందరికీ అర్థమయ్యే విధంగా చెప్పాలన్నారు. పంచాయతీ ఆదాయ వనరులు, ఖర్చులు ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్ , తదితరులు పాల్గొన్నారు.

## స్వార్థ ప్రయోజనాల కోసమే జగన్ పర్యటన

తోట్లవల్లూరు : మొంథా తుఫాను సమయంలో మాజీ సీఎం జగన్ ప్రజలకు ఎలాంటి సేవలు అందించకుండా సొంత ప్రయోజనాల కోసమే కృష్ణాజిల్లాలో పర్యటించారని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తుఫాను బాధిత రైతులకు వైసీపీ ఒక్కపైసా సాయం చేయలేదన్నారు. కేవలం కూటమిపై నిందలు వేయటానికే జగన్ పర్యటన చేసినట్టుగా ఉందని ఆయన విమర్శించారు.

# సమాజంలో పేదరిక నిర్మూలనే పీ4 ధ్యేయం

● కలెక్టర్ డీకే బాలాజీ

గుడ్లవల్లేరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ఎంతో కష్టపడి ఉన్నత స్థాయికి చేరి, పేదరికం నుంచి బయట పడాలనే సత్ సంకల్పంతో బంగారు కుటుంబాల వారికి సహాయం చేసేందుకు పీ4 మార్గదర్శకులు ముందుకు వస్తున్నారు. ఇలాంటి అవకాశాలు వచ్చినపుడే వాటిని అందిపుచ్చుకొని పేదరికం నుంచి బయటపడాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. మంగళవారం డోకిపర్రులోని భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో పీ4 మార్గదర్శి మెగా ఇంజనీరింగ్ లిమిటెడ్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నైపుణ్య శిక్షణాతరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న 45 మందితో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదరికం నిర్మూలనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యం పేరుతో పీ4 అనే కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. అందులో భాగంగానే పీ4 మార్గదర్శిగా ఉన్న మెగా ఇంజనీరింగ్ లిమిటెడ్ ఫౌండేషన్ వారు ప్రభుత్వం గుర్తించిన బంగారు కుటంబానికి చెందిన వారిలో ఎలక్ట్రీషియన్, ప్లంబర్ వృత్తి పై అభిరుచి కలిగినవారికి ఈ నైపుణ్య శిక్షణ ఇస్తున్నారన్నారు. ఈ శిక్షణను సద్వినియోగించుకుని వృత్తిలో రాణించి పేదరికం నుంచి బయటికి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ హరినాథ్, గుడివాడ నియోజకవర్గ ప్రత్యేకాధికారి జిల్లా పశుసంవర్ధకశాఖ జేడి చిన నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పొందుతున్న వారితో మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

గుడ్లవల్లేరు : రాష్ట్ర ప్రభుత్వం పేదరికం నిర్మూలనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం, ప్రైవేటు,ప్రజల భాగస్వామ్యం పేరుతో పీ4 చేపట్టిన కార్యక్రమం విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రభుత్వ ఉద్యోగులను ఆదేశించారు. మంగళవారం డోకిపర్రులో గుడ్లవల్లేరు మండలానికి చెందిన బంగారు కుటుంబాల రిసోర్స్ పర్సన్‌లుగా ఎంపికైన వారితో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ మండలంలో మీరు నిర్వహించిన సర్వేలో బంగారు కుటుంబాల వారు తెలిపిన సమస్యలను తెలపాలని కలెక్టర్ అడిగారు. కాగా యువతీ, యువకులు ఉపాధి కల్పించాలని కోరారన్నారు. గ్రామాల్లో రక్షిత మంచినీటి సమస్యలు, ముురుగుకాల్వల సమస్యలు, కొందరు దివ్యాంగులు ఊతకర్రలు, వీల్‌చైర్లు, దివ్యాంగ వాహనాలు కోరుతున్నారన్నారన్నారు. ఉపాధి కల్పనకోసం టైలరింగ్, టిఫెన్ సెంటర్లు, ఇస్త్రీ తోపుడు బండ్లు, బడ్డీలు, ఎలక్ట్రీషియన్, కార్పెంట్‌వర్కర్స్‌గా, ప్లంబింగ్ వర్కర్లుగా అవ్వాలనీ, గొర్రెలు,గేదల పెంపకం, విస్తరాకుల తయారీ తదితర వ్యాపారాలను కోరుతున్నారని వివరించారు. కొందరు వృద్ధాప్య, వితంతు పింఛన్లు కావాలని కోరుతున్నారని వారు కలెక్టర్‌కు వివరించారు. తాగునీరు, డ్రెయినేజీ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. దివ్యాంగులు కోరిన ఉపకారాలు, పింఛన్లను ప్రభుత్వం నుంచి అర్హతల ప్రకారం అందచేస్తామన్నారు.



పమిడిముక్కలలో రైతులతో మాట్లాడుతున్న వైఎస్ జగన్

## పామర్రులో జగన్ పర్యటన

పామర్రు, కూచిపూడి:మొంథా తుఫాను వల్ల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటను ప్రభుత్వం కోనుగోలు చేసేవిధంగా అన్నదాతలకు అండగా ఉండి ప్రభుత్వంపై అ వసరం మేరకు వైసీపీ పోరాడుతోందని, అన్నదాతలు ఏమా త్రం ఆందోళనకు, గురికావద్దని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి భరోసనిచ్చారు. తు ఫాన్ ప్రభావం కారణంగా పంట దెబ్బతిన్న పొలాలను పరిశీలించేందుకు పెడన నియోజకవర్గానికి బయలుదేరిన జగన్మోహన్‌రెడ్డి మార్గమధ్యంలో కొద్దిసేపు పామర్రు నియోజకవర్గంలోని నిడుమోలులో ఆగారు. ఉదయం నుంచి పడిగాపులు కాస్తూ ఇంతసేపు నిలుచుని ఉన్నా తమను జగన్ పట్టించుకోకుండా వెళ్లిపోవడంపైప్రజలు అసహనం వ్యక్తం చేశారు.

పమిడిముక్కల: గోపువానిపాలెం రోడ్డుపైన ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా రోడ్డుపక్కకు వెళ్లాలని పమిడిముక్కల సీఐ చిట్టిబాబు వైసీపీ నాయకులకు సూచించడంతో మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పోలీసులతో వాగ్వాదానికి దిగి సీఐకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి కొద్దిసేపు హడావిడి చేశారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

కూచిపూడి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి):ధాన్యం కొనుగోలు సమయానికి తేమ పరిశీలన యంత్రాలు, సంచులు, ఎలక్ట్రానిక్ కాట, రిజిష్టర్లు సిద్ధం చేసుకోవాలని కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ నవీన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మొవ్వ, కాజ, భట్లపెనుమర్రు గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అయా కేంద్రాల్లోని సిబ్బందికి పలు సూచనలు చేశారు. మొవ్వ మండలంలోని వరి సాగుపై సంబంధిత అధికారుల నుంచి వివరాలు సేకరించారు. అలాగే రైతు సేవా కేంద్రాల నిర్వాహకులైన గ్రామ వ్యవసాయ సహాయకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె.మస్తాన్, ఎంపీడీవో సుహాసిని, వ్యవసాయ శాఖ ఏడీఏ శ్యామల, ఏవో సురేష్ బాబు నాయక్, పాల్గొన్నారు.

పామర్రు : గ్రామాల్లో రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న రైతు సేవకేంద్రాల్లో ప్రభుత్వ ఉద్యోగులు మెరుగైన సేవలందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఉండ్రపూడి, పసుమర్రు ఆర్ఎస్‌కేలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మరో కొద్దిరోజుల్లో పంటకోతలు ప్రారంభించనున్న తరుణంలో సిబ్బంది రైతులందిస్తున్న సేవలను, వాటికి సంబంధించిన రిజిస్టర్లును పరిశీలించి అయా గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదుపై కొన్ని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలమేరకు దాన్యం సేకరణ జరిగేవిధంగా మండల స్థాయి అధికారులు నిరంతర పర్యవేక్షణతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



కాజలో అధికారులకు సూచనలు ఇస్తున్న జేసీ నవీన్

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

● డిప్యూటీ కలెక్టర్ ఎస్.పోతురాజు

కూచిపూడి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సివిల్ సప్లైస్ విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ ఎస్. పోతురాజు వీఆర్వోలకు సూచించారు. మీకోసం ద్వారా పట్టాదారు పాస్ పుస్తకాల కోసం దరఖాస్తులు దాఖలు చేసుకున్న అర్జీల ప్రస్తుత పరిస్థితిని వీఆర్వోల ద్వారా వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మొవ్వలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి అర్జీదారులకు ఫోన్ చేసి దీనికి సంబంధించిన వివరాలను మంగళవారం సాయంత్రం సేకరించారు. వారితో ఫోన్‌లో మాట్లాడుతూ స్థానిక అధికారుల నుంచి పాస్ పుస్తకాల విషయంలో ఏమైనా ఇబ్బందులు వచ్చాయా? పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వటం కోసం డబ్బులు అడిగారా? అంటూ ఫోన్ చేసి వారు వెల్లడించిన వివరాలను రికార్డు చేసుకున్నారు. పామర్రు, మొవ్వ, పమిడిముక్కల, పెదపూడి మండలాలకు నోడల్ ఆఫీసర్‌గా కొనసాగుతున్న ఆయన వీఆర్వోలతో మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని స్థానిక అధికారులను, సిబ్బందిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ ఏ.కిషోర్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



వీఆర్వోలతో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ పోతురాజు

# ఘనంగా యువజనోత్సవాలు

గుడ్లవల్లేరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యువజనోత్సవాలు మంగళవారం గుడ్లవల్లేరులోని ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ వేదికగా నిర్వహించారు. జిల్లాలోని వివిధ కళాశాల నుంచి వచ్చిన విద్యార్థులు యువజనోత్సవాల్లో పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా పాల్గొన్న జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి కె.మధు భూషణం మాట్లాడుతూ యువతలో ఉన్న కళాసాంస్కృతిక ప్రతిభను గుర్తించి వారి అభివృద్ధికి దోహదపడాలన్న సంకల్పంతో యువజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రతీసంవత్సరం ప్రభుత్వం ఈ యువజనోత్సవాలు నిర్వహించి యువతలోని కళాకారులను గుర్తిస్తూ ప్రోత్సహిస్తుందన్నారు. పోటీల్లో విజేతలైన యువతకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎన్.రాజశేఖర్, జిల్లా యువజన సంక్షేమ శాఖ అధికారి యు.శ్రీనివాసరావు, యూత్ ఆఫీసర్ ఎస్.రాము, కె.రమేష్, సురేంద్రబాబు, డి.సుబ్బారావు, మహ్మద్ బాజీ పాల్గొన్నారు.



నృత్యప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

# పదోన్నతి పొందిన జనార్దనరావుకు సత్కారం

గుడివాడ రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి పొందిన జనార్దనరావు సేవలు చాలా ఉపయోగపడ్డాయని ఎంపీపీ గద్దె పుష్పరాణి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మోటూరు కార్యదర్శిగా పని చేసిన జనార్ధనరావు పదోన్నతిపై పామర్రు ఎంపీడీవోగా జాయిన్ అయ్యారు. అందుకు గానూ మండల పరిషత్ కార్యాలయంలో ఆయనను సిబ్బంది మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరితో మంచిగా ఉండి పార్టీలకతీతంగా బిళ్లపాడు, మోటూరు తదితర గ్రామాల్లో చక్కటి సేవలందించారని కొనియాడారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ప్రజలతో మమేకమై తన పరిపాలన సాగించినట్లు తెలిపారు. అధికారులతో ప్రజల సమస్యలను చెప్పి పరిష్కారమవ్వటానికి కృషి చేశారని తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని పదోన్నతులు పొంది మంచి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విష్ణుప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో జి.శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



జనార్దనరావును సత్కరిస్తున్న ఎంపీపీ పుష్పరాణి, తదితరులు

## దీక్షాపరులకు భిక్ష ఏర్పాటు

గుడివాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వీరాంజనేయస్వామి దేవస్థానంలో హనుమాన్ భక్త బృందం ఆధ్వర్యంలో మంగళవారం హనుమాన్, సాంబశివ, అయ్యప్పస్వామి, సకల దీక్షాపరులకు దేవస్థానంలో భిక్ష ఏర్పాటు చేశారు. భిక్షదాతలు కూరాకుల వెంకట నాగేశ్వరరావు, ఆలయ ప్రధానఅర్చకులు విజయ్, వీరబాబు, సుబ్రహ్మణ్యం, ఆంజనేయులు, భక్త బృందం పాల్గొన్నారు.





విదేశీ వస్తువులు కొనొద్దంటూ ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

## విదేశీ వస్తువులను కొనుగోలు చేయొద్దు

గుడివాడ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : విదేశీ వస్తువులను వద్దని, స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయాలని బీజేపీ టూటౌన్ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) అన్నారు. మంగళవారం పట్టణంలో విదేశీ వస్తువులను వద్దంటూ ప్రచారం నిర్వహించారు. స్వదేశీ నినాదంతో కూడిన స్టిక్కర్లు, సంతకాలను సేకరించి స్వదేశీ వస్తువులను వినియోగిస్తామని, ప్రోత్సమిస్తామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కోన వెంకటేష్, బోనం గోపిక, లంకా రాంబాబు, రీటా, చరణ్,పాల్గొన్నారు.

## కౌశలం సర్వే పూర్తిచేయాలి

పామర్రు : కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యవతకు ఉపాధి అవకాశాల కల్పించడం కోసం మండలంలో కోనసాగుతున్న కౌశలం పథకం సర్వేను తక్షణమే పూర్తిచేయాలని ఎంపీడీవో కాంద్రుజ్యోతి అన్నారు. మంగళవారం ఆమె కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ గ్రామ సచివాలయ ఉద్యోగులు ఇంటి పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## కేటీఆర్ కళాశాలలో జాబ్‌మేళా 7న

గుడివాడ : నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు స్థానిక కేటీఆర్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ శుక్రవారం మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు కలెక్టర్ డీకే బాలాజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బి.ఫార్మసీ పూర్తిచేసిన 18 నుంచి 35 సంవత్సరాలలోపు యువత అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు హాజరు కావాలన్నారు. అర్హతలు కలిగిన అభ్యర్థులు ముందుగా హెచ్‌టీటీపీపీఎస్//నైపుణ్యం.ఏపీ.జీవోవీ.ఇన్/యూజర్-రిజిస్ట్రేషన్ లింక్‌లో తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ కావడంతో పాటు జాబ్‌మేళాకు తన వివరాలు, బయోడేటా ఫారాలతో పాటు ఆధార్, ఆధార్‌కు లింకైన ఫోన్ నెంబరు, పాన్, సర్టిఫికేట్ జిరాక్స్ కాపీలతో రావాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్ నెం. 9848819682, 966654641కు సంప్రదించాలని కోరారు.

# కార్తీక పౌర్ణమికి ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి

గుడివాడ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా స్థానిక పెద్ద శివాలయం, చిన్న శివాలయాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాటు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లవారుజామున 3.30 గంటల నుంచి భక్తుల తాకిడి ఉంటుందని, స్వామి దర్శనం నిమిత్తం భక్తుల కోసం క్యూలైన్లు, మంచినీటి సౌకర్యం, భక్తులకు ఉచిత ప్రసాదం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్తీక దీపారాధన సందర్భంగా భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. వలంటీర్లను నియమించామని, మైక్ ద్వారా ముందు జాగ్రత్తలను తెలువనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాత్రికి జ్వాలాతోరణం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు గోపాలరావు తెలిపారు.



విశేష అలంకరణలో దర్శనమిస్తున్న స్వామి



విద్యుద్దీపాలతో అలంకరించిన పెద్ద శివాలయం

## వైసీపీ ఉనికి కోసమే జగన్ పర్యటన

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

పామర్రు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ రైతుల్ని పరామర్శించే నెపంతో ప్రజలను మరోసారి మోసం చేసేందుకే వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి జిల్లాలో పర్యటి స్తున్నారని ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా విమ ర్శించారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జగన్ తన పార్టీ ఉనికిని కాపాడుకునేందుకే ఇలాంటి జిమ్మిక్కులు చేస్తున్నారని ఆరోపించారు. విధి నిర్వహణలోని పోలీసులపై పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఓ రౌడీ మాదిరిగా దౌర్జన్యానికి దిగడం ప్రజలు గమనిస్తునే ఉన్నారన్నారు. జగన్ తన పార్టీ స్వార్థం కోసం చేసే ఇలాంటి దొంగ పరామర్శలకు చెక్ పెట్టకపోతే రాబోయే రోజుల్లో జగన్‌కు ప్రజలే తగిన బుద్ది చెబుతారన్నారు.

# శిథిల వంతెనపై ప్రయాణించేదెలా..!

● ప్రమాదకరంగా వంతెన
● భయాందోళనలో ప్రయాణికులు
● పట్టించుకోని అధికారులు

(పమిడిముక్కల - ఆంధ్రజ్యోతి): మర్రివాడ వద్ద రైవస్‌కాల్వపై వంతెన కూలేందుకు సిద్ధంగా ఉన్న పరిస్థితుల్లో ప్రజలు బిక్కుబిక్కుమంటూ ప్రయాణం చేస్తున్నారు. విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారి నుంచి మర్రివాడ, సాయిపురం, జబర్లపూడితో పాటు పెదపారుపూడి గ్రామాలకు వెళ్లే రోడ్డులో మర్రివాడ వద్ద రైవస్ కాల్వపై బ్రిటీష్ వారి సమయంలో నిర్మించిన వంతెనపై కొంతమేర వంతెన పొడవునా బీటలిచ్చి కుంగిపోయింది. మరొక చోట పెద్ద గుంతపడి వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. వంతెన ప్రమాదకరంగా ఉండటంతో అక్కడి పరిస్థితి తెలియజేస్తూ గ్రామపంచాయతీ సిబ్బంది వంతెనపైన ట్రాక్టరు ట్రక్కు ఉంచి ప్రమాద హెచ్చరిక సూచిక ఏర్పాటు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు అనునిత్యం ఈ వంతెనపై నుంచి దిచక్రవాహనాలతో, ఆటోలు, కార్లలో పయనిస్తుంటారు. ఉయ్యూరు స్కూల్ బస్సులు సైతం గ్రామాలలోని విద్యార్థులకోసం గ్రామాలలోకి వచ్చి వెళుతుంటాయి. వరి కోతల సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ధాన్యం సేకరణ, వ్యవసాయ పనులకు ట్రాక్టర్లు ఇతర యంత్రాలు, లారీలు వెళుతుంటాయి. ఈ పరిస్థితుల్లో వంతెన ప్రమాదకరంగా ఉండటంతో ద్విచక్రవాహనాలు, ఆటోల్లో వెళ్లేవారు సైతం వంతెన ఎప్పుడు కూలుతుందోనన్న భయాందోళనలో ప్రయాణికులు బిక్కు బిక్కుమంటూ ప్రయాణించాల్సి వస్తోంది. పొలాల్లో ధాన్యం చేరవేసుకునేదెలా అని రైతులు ఆందోళన చెందుతున్నారు.



వంతెనపై ఏర్పడిన గుంతల వద్ద అడ్డుపెట్టిన తాడిబొండ్లు, సిమ్మెంటు బస్తాలు



మర్రివాడ వద్ద వంతెనపై టాక్టరు ట్రక్కు అడ్డుపెట్టి ఏర్పాటుచేసిన ప్రమాద హెచ్చరిక

**బ్రాయిలర్ ధరలు**



| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 130, 139, 150 |
| చికెన్ విత్ స్కిన్ | 250 |
| చికెన్ స్కిన్‌లెస్ | 260 |

**నెక్ కోడిగుడ్డు ధర (100)**
విజయవాడ జోన్ రైతు ధర రూ. 575



## రామలింగేశ్వరస్వామికి గులాబీల అర్చన

నాగాయలంక, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం మంగళవారం సందర్భంగా రామపాదక్షేత్రం పుష్కర ఘాట్‌లో రామలింగేశ్వరస్వామికి ఎర్ర గులాబీలతో అర్చన చేశారు. వేకువజాము నుంచే భక్తులు ఘాట్ వద్ద కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, ఉప్పల బుజ్జి తదితరులు పర్యవేక్షించారు.

## బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఫణికుమార్



మచిలీపట్నం టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మచిలీపట్నం టీడీపీ నాయకుడు పి.వి.ఫణికుమార్‌ను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పని చేసిన పి.వి. ఫణికుమార్ పేద బ్రాహ్మణులకు, యువతకు ఉపాధికి, విదేశాల్లో చదవుకు బ్రాహ్మణ విద్యార్థులకు రుణాలు అందించారు. బ్రాహ్మణ మహిళలకు గ్రూపు రుణాలు అందజేసి చేయూతనిచ్చారు. కుట్టుమిషన్లు ఇచ్చి స్వయం ఉపాధికి మార్గం చూపారు. జిల్లా టీడీపీ ప్రచార కార్యదరి ఫణికుమార్ మాట్లాడుతూ, తనకు బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి ఇచ్చేందుకు సహకరించిన మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రామప్రసాద్, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ, గొర్రెపాటి గోపీచంద్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ వేమూరి ఆనందసూర్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతురాజు, ఏ.ఆర్.కె. మూర్తి తదితరులు అభినందనలు తెలిపారు.



పదవీ విరమణ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

## పెడన మునిసిపల్ కమిషనర్ చంద్రశేఖరరెడ్డికి ఘనసన్మానం

పెడన, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పదవీ విరమణ సందర్భంగా పెడన మునిసిపల్ కమిషనర్ లింగారెడ్డి చంద్రశేఖరరెడ్డికి తోటమూల ఫంక్షన్ హాలులో మంగళవారం ఘన సన్మానం జరిగింది. చంద్రశేఖరరెడ్డి, మంజుల దంపతులను పూలమాలలు, దుశ్శాలువాలు, నూతన వస్త్రాలు, జ్ఞాపికలతో సత్కరించారు. తనకు జరిగిన సన్మానానికి చంద్రశేఖరరెడ్డి ఉచిత రీతిన కృతజ్ఞతలు తెలిపారు. వంగా శ్రీనివాసరావు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. మునిసిపల్ మేనేజర్ మట్టా రాజా సారధ్యంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ కటకం నాగకుమారి, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీవో అరుణకుమారి, మచిలీపట్నం నగర కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ మన్నం గోపాలరావు, గుడివాడ కమిషనర్ మనోహర్, ఉయ్యూరు కమిషనర్ జయరామారావు, విశ్రాంత కమిషనర్ వెంకటేశ్వరరావు, ముడా ఏపీవో వి సుజనకుమారి, కౌన్సిలర్లు కటకం ప్రసాద్, గరికముక్కు చంద్రబాబు, బాబులాల్ తదితరులు పాల్గొన్నారు.

## హసీంబేగ్‌కు టీడీపీ నాయకుల సత్కారం

మచిలీపట్నం టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన హసీంబేగ్‌ను టీడీపీ నాయకులు పల్లపాటి సుబ్రహ్మణ్యం, ఊకంటి రాంబాబు తదితరులు మంగళవారం ఘనంగా సత్కరించారు.



## యూనియన్ బ్యాంకు ఉద్యోగుల బైక్ ర్యాలీ

మచిలీపట్నం టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ సందర్భంగా మంగళవారం యూనియన్ బ్యాంకు ఉద్యోగులు బందరులో బైక్ ర్యాలీ నిర్వహించారు. మచిలీపట్నం రీజినల్ ఆఫీసు ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని రీజినల్ హెడ్ కె.వెంకట్రావు ప్రారంభించారు. డిప్యూటీ రీజినల్ హెడ్ కె.యు.రామలింగారెడ్డి, పిహెచ్‌పి దాస్, రీజినల్ విజిలెన్స్ ఆఫీసర్ కె. వెంకట్రాజు, రిటైర్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సాయిమోహన్, సంఘం నాయకులు వై.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



పంటనష్టంపై మాట్లాడుతున్న రైతు సంఘంనేత సురేంద్రనాథ్ బెనర్జీ, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు

## ఎకరాకు రూ.30 వేలు పరిహారం చెల్లించాలి

● ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్

చల్లపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాను వల్ల జరిగిన పంట నష్టాన్ని పారదర్శకంగా నమోదు చేయాలని, ఎకరాకు రూ.30 వేలు పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ డిమాండ్ చేశారు. చల్లపల్లిలోని చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల సంభవించిన మొంథా తుఫాన్ కారణంగా వరి నీటిలో నానుతోందని, గాలులకు కంకులు రాలిపోయాయని, పాలు పోసుకునే దశలో ఉండటంతో గింజ కట్టలేదని వివరించారు. దాని వల్ల దిగుబడి తగ్గే అవకాశం ఉందన్నారు. పడిపోయిన పంటకే నష్టపరిహారం రాయాలని ఆదేశాలు జారీ చేయటంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. వరికి ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారం చెల్లించాలని, వాణిజ్య పంటలకు రూ.50 వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ప్రతిసారి మోసం చేస్తున్నాయని విమర్శించారు. వరి, వాణిజ్య పంటల రైతులకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు మల్లుపెద్ది బోసు, కొర్రపాటి ముఖర్జీ, దాసరి గోపాలకృష్ణ, గోగినేని రత్తయ్య, సీపీఐ నాయకులు కొల్లూరి శ్రీధర్, నక్క శ్రీనివాసరావు, సిద్దాబత్తుల వాసు తదితరులు పాల్గొన్నారు.

## సంగమేశ్వరంలో ఎల్ఐసీపై అవగాహన



మాట్లాడుతున్న బ్రాంచి మేనేజర్ హరిప్రసాద్

నాగాయలంక, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జీవిత బీమా సంస్థ అవనిగడ్డ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సంగమేశ్వరంలో అవగాహన సదస్సు నిర్వహించారు. జీవిత బీమా వల్ల ఉపయోగాలను బ్రాంచి మేనేజర్ ఆకుల హరిప్రసాద్ వివరించారు. దేశ ప్రయోజనాల కోసం ప్రభుత్వానికి 40 లక్షల కోట్లు అప్పు తెచ్చి భారతదేశ ఆర్థిక వ్యవస్థకు ఎల్ఐసీ వెన్నెముకగా నిలిచిందని వివరించారు. ఏజెంటు నాయుడు రామ సీతను సత్కరించారు. సర్పంచ్ నాయుడు నాగమల్లేశ్వరి, ఎంపీటీసీ సభ్యుడు నాగరాజు, ఏజెంట్లు మాట్లాడారు.

## పిట్టల్లంకలో పూరిల్లు దగ్ధం

కోడూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదం సంభవించి పూరిల్లు దగ్ధమైన సంఘటన పిట్టల్లంక గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. కైలా శరత్‌బాబు పూరి ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యి మంటలు చెలరేగడంతో గ్యాస్ బండ పేలిపోయింది. ఈ దుర్ఘటనలో పూరిల్లు దగ్ధమైందని స్థానికులు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకునే సమయానికి ఇల్లు పూర్తిగా దగ్ధం అయ్యింది. ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. సం ఘటనా స్థలాన్ని వీఆర్వో గోపాలకృష్ణ పరిశీలించారు.



వైసీపీ కార్యకర్తలకు అభివాదం చేస్తున్న మాజీ సీఎం జగన్‌మోహనరెడ్డి

## మాజీ సీఎం జగన్‌కు వైసీపీ శ్రేణుల స్వాగతం

గూడూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాను కారణంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించేందుకు మంగళవారం గూడూరు వచ్చిన మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహనరెడ్డికి పెడన వైసీపీ ఇన్‌చార్జి ఉప్పాల రాము నేతృత్వంలో వైసీపీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. తరకటూరు నుంచి పెద్ద సంఖ్యలో గూడూరు వచ్చిన కార్యకర్తలకు తన వాహనం నుంచి అభివాదం చేసుకుంటూ వరి పొలాలు పరిశీలించేందుకు రామరాజుపాలెం వెళ్లారు. మాజీ మంత్రి కొడాలి నాని, జడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక, మాజీ ఎమ్మెల్యేలు వల్లభనేని వంశీ, సింహాద్రి రమేష్, దూలం నాగేశ్వరరావు, దేవినేని అవినాష్, సంగా మధుసూదనరావు, వేముల సురేష్ రంగబాబు, బూరగడ్డ శ్రీకుమార్, కారుమంచి కామేశ్వరరావు, గొరిపర్తి రవికుమార్, సమ్మెట జయవర్ధన్, సర్పంచ్ లింగం సులోచనారాణి, లింగం విజయకుమార్, పర్ణం పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

## జగన్ పర్యటన ఆలస్యం.. ప్రజల నిరుత్సాహం

మచిలీపట్నం టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం జగన్‌మోహనరెడ్డిని చూసి మాట్లాడేందుకు మంగళవారం ఉదయం 10 గంటల నుంచి జాతీయ రహదారి వద్ద మహిళలు పడిగాపులు పడాల్సి వచ్చింది. జగన్‌మోహనరెడ్డి సాయంత్రం 6 గంటలకు బందరు మండలంలోకి రావడంతో వారంతా నిరుత్సాహానికి గురయ్యారు.

## మరోసారి మోసం చేసేందుకే జగన్ పర్యటన : టీడీపీ ధ్వజం

మచిలీపట్నం టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అధికారంలో ఉన్నప్పుడు రైతులను పట్టించుకోని జగన్మోహనరెడ్డి ఇప్పుడు తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంట పొలాలను సందర్శించాడనికి వచ్చి రైతులను మరోసారి మోసం చేస్తున్నారని ముస్లిం మైనార్టీ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ హసీంబేగ్, మునిసిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ పల్లపాటి సుబ్రహ్మణ్యం విమర్శించారు. ఈడేపల్లిలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు.